

అమ్మో.. బార్లా..

- రీ నోటిఫికేషన్‌కూ స్పందన అరకొరే
- గుంటూరులో 26, పల్నాడులో 8, బాపట్లలో 6 బార్లకు నేడు లాటరీ
- మిగిలిన బార్ల విషయంలో ప్రభుత్వ నిర్ణయంపై ఉత్కంఠ

112 బార్లలో 72 బార్లకు దరఖాస్తులు నిల్

ఒకప్పుడు మద్యం బార్ల లైసెన్సుల కోసం వ్యాపారులు పోటీపడేవారు. ఎంత మొత్తం అయినా చెల్లించేందుకు కూడా సిద్ధమయ్యేవారు. అయితే నూతన మద్యం పాలసీ ప్రకారం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో బార్ల లైసెన్సుల కోసం వ్యాపారులు ముందుకు రావడంలేదు. ఇప్పటికి రెండు సార్లు నోటిఫికేషన్ ఇవ్వగా వ్యాపారుల నుంచి స్పందన రాలేదు. దీంతో ఎలాగైనా బార్లకు వ్యాపారుల నుంచి దరఖాస్తులు చేయించాలని ఎక్సైజ్ విభాగం రెండు సార్లు గడువు కూడా పెంచింది. అయినా బార్లు తీసుకునేందుకు వ్యాపారులు వెనుకంజ వేస్తున్నారు. తొలి విడత నోటిఫికేషన్ లాటరీ ప్రక్రియ అనంతరం మిగిలిన(గుంటూరు జిల్లాలో 67, పల్నాడు జిల్లాలో 30, బాపట్ల జిల్లాలో 15) బార్లకు ఈ నెల 3న ఎక్సైజ్ శాఖ రీ నోటిఫికేషన్ ఇచ్చింది. మూడు జిల్లాల పరిధిలో 112 బార్లకు రీ నోటిఫికేషన్ జారీ చేసి ఒకసారి గడువు పెంచినా కేవలం 72 బార్లకు నిబంధనల ప్రకారం దరఖాస్తులు వచ్చాయి. అంటే మూడు జిల్లాల పరిధిలో 40 బార్లకు ఎవరూ ముందుకు రాలేదు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఏం చేస్తారో తెలియదు.. ఎట్టి పరిస్థితుల్లోనూ జిల్లా పరిధిలోని అన్ని బార్ల ఏర్పాటుకు సంబంధించి దరఖాస్తులు రావాల్సిందేనని ఈ నెల 3న బార్ల రీ నోటిఫికేషన్ జారీ సమయంలో ఎక్సైజ్ యంత్రాంగానికి ఉన్నతాధికారుల నుంచి అందిన అనధికారిక ఆదేశాలు. తొలివిడత నోటిఫికేషన్‌లో ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో ఉన్నతాధికారులు బాపట్ల జిల్లా యంత్రాంగంపై కన్నెర్ర చేసిన సంగతి తెలిసిందే. మొత్తం బార్లకు దరఖాస్తులు రావాల్సిందేనని లేకపోతే సిబ్బంది వైఫల్యంగా పరిగణించి చర్యలకు సైతం వెనకాడబోమనే అనధికారిక ఆదేశాలను ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు రీ నోటిఫికేషన్ జారీ సమయంలో పంపినట్లు జోరుగా ప్రచారం జరిగింది. ఈ పరిస్థితుల్లో వ్యాపారులతో ఎలాగైనా దరఖాస్తులు చేయించేందుకు శత విధాలా ప్రయత్నాలు చేశారు. ఎక్కడికక్కడ వ్యాపారులతో సమావేశాలు నిర్వహించారు. లైసెన్స్ పొందిన వారి ద్వారా కూడా దరఖాస్తులు చేయించేందుకు ప్రయత్నించారు. చివరకు రాజకీయ నేతలతో వ్యాపారులపై ఒత్తిడి కూడా చేశారు. అప్పటి నుంచి ఎక్సైజ్ శాఖ అధికారులు దరఖాస్తులు వేయించడానికి చేయని ప్రయత్నం లేదు. మలి నోటిఫికేషన్ ఈ నెల 3న జారీ చేయగా తొలుత ఇచ్చిన గడువు 14 కాగా దానిని 17 వరకు పొడిగిస్తూ ఎక్సైజ్‌శాఖ నిర్ణయం తీసుకోగా బుధవారంతో ఆ గడువూ ముగిసింది. అయినా రీ నోటిఫికేషన్ ద్వారా కూడా మొత్తం బార్లకు వ్యాపారుల నుంచి దరఖాస్తులు రాలేదు.

బాపట్ల జిల్లాలో మొత్తం 19 బార్లకు తొలి నోటిఫికేషన్‌లో 4 బార్ల ఏర్పాటు ప్రక్రియను ఎక్సైజ్ విభాగం ముగించింది. మిగిలిన 15 బార్లకు రీ నోటిఫికేషన్ జారీ చేయగా బుధవారం సాయంత్రం గడువు ముగిసేప్పటికి ఆరు బార్లకు 24 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.నిబంధనల ప్రకారం

(మిగతా 6వ పేజీలో)

ఈ సారైనా.. ఎన్నికలు జరిగేనా..

నరసరావుపేట వార్డుల విభజనపై కోర్టులో కేసులు

నరసరావుపేట మున్సిపాలిటీకి ఈ సారైనా ఎన్నికలు జరుగుతాయా లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గత ఎన్నికల సమయంలో వార్డులను విభజించారు. 34 వార్డుల నుంచి 38 వార్డులకు పెంచారు. వార్డుల విభజనపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ అప్పటి అధికార పార్టీ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో 2021లో జరగాల్సిన మునిసిపాలిటీ ఎన్ని కలను నిలిపివేశారు. అప్పటి నుంచి ప్రత్యేక అధికారి పాలన కొనసాగుతోంది. నాడు వైసీపీ నేతల కనుసన్నల్లోనే మునిసిపాల్టీ అధికారులు వార్డుల విభజన చేశారు. అయితే ఆ పార్టీ నేతలు కోర్టుకు పిటిషన్ దాఖలు చేయడం విశేషం.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మునిసిపాల్టీకి ఎన్నికలు జరిగి కౌన్సిల్ ఏర్పడితే తమ పెత్తనం సాగదన్న దురుద్దేశంతోనే నాడు వైసీపీ నేతలు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ పిటిషన్‌కు కోర్టు కొట్టివేసింది. అయినా మునిసిపాల్టీకి ఎన్నికలు జరగకుండా వైసీపీ నేతలు అడ్డుకున్నారు.



వార్డుల పునర్విభజన సక్రమంగా జరగలేదని వైసీపీకి అనుకూలంగా చేశారంటూ వైసీపీ పిటిషన్ కోర్టు కొట్టివేసిన అనంతరం టీడీపీ నేతలు ఐదు పిటిషన్‌లను హైకోర్టులో దాఖలు చేశారు. ఇవి కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. మునిసిపాల్టీకి ఎన్నికలు నిర్వహించాలంటే కోర్టులో కేసులు పరిష్కారం కావాల్సి ఉంది. నరసరావుపేట మునిసిపాల్టీలో పాటు ఇతర మునిసిపాల్టీలకు సబంధించిన కేసులపై ప్రభుత్వం దృష్టి సారించింది. నరసరావుపేట మునిసిపాల్టీకి సంబంధించి పిటీషన్‌లు దాఖలు చేసింది. టీడీపీ వారే కావడంతో వారి చేత వాటిని ఉపసంహరింపచేస్తే ఎన్నికలకు మార్గం సుగమం అవుతుంది. ఈ దిశగా కూడా పార్టీ అధిష్టానం దృష్టి సారిస్తున్నట్టు తెలిసింది.

- 34 వార్డుల నుంచి 38 వార్డులకు పెంచిన వైనం
- పిటిషన్‌లు దాఖలు చేసిన టీడీపీ నేతలు
- 34 వార్డులకు ఎన్నికలు నిర్వహించే యోచన

ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం అక్టోబరు 15వ తేదీలోపు వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలి, అదే నెలలో 16 నుంచి నవంబరు 15 లోగా వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను ప్రచురించాలి. నంబరు ఒకటి నుంచి 15 లోపు ఎన్నికల అధికారుల నియామకం, 16 నుంచి 30 లోగా పోలింగ్ కేంద్రాల ఖరారు చేయాల్సి ఉంది. డిసెంబరు 15 లోపు వార్డుల రిజర్వేషన్లు ఖరారు చేయాలి. ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు ఇతర మునిసిపాల్టీలో అధికారులు సమాయత్తమయ్యారు. నరసరావుపేట మునిసిపాల్టీలో కోర్టులో కేసులు ఉండటంతో ప్రక్రియ ప్రారభించే పరిస్థితులు లేవనే చెప్పాలి.

34 వార్డులకే ఎన్నికలు నిర్వహించాలని యోచన

ఎన్నికల జరగకపోవడంతో మునిసిపాలిటీ రూ. 9.5 కోట్లు ఆర్థిక సంఘం నిధులను కోల్పోయిన విషయం తెలిసిందే. దీంతో ఆర్థికంగా కునారిల్లే పరిస్థితులు నెలకొనడంతో ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు ప్రభుత్వం తీసుకుంటోంది. 34 వార్డులను 38 వార్డులకు గత ఎన్నికల సందర్భంగా పెంచారు. అయితే కోర్టులో కేసులు షెడ్యూల్ నాటికి తేలకపోతే 34 వార్డులకే ఎన్నికలకు వెళ్లాలన్న అంశాన్ని కూడా మునిసిపల్ శాఖ పరిశీలిస్తోందని చెబుతున్నారు. పిటిషన్‌లు దాఖలు చేసిన వారు టీడీపీ వ్యక్తులు కావడంతో వీరి చేత పిటిషన్లు ఉపసంహరించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్టు తెలిసింది. స్థానిక టీడీపీ ముఖ్య నేతలు దృష్టి సారిస్తే కోర్టులో పిటిషన్లు ఉపసంహరించడం పెద్ద పనికాదన్న వాదనను పార్టీ వర్గాలు వినిపిస్తున్నాయి.

ఆ ఐదు పంచాయతీలకు విలీన శాపం

మునిసిపాల్టీలో రావిపాడు, కేసానుపల్లి, ఇస్సపాలెం, లింగంగుంట్ల, యల్లమంద పంచాయతీల పరిధిలోని కొంత ప్రాంతాన్ని మునిసిపాల్టీలో విలీనం చేసి వార్డుల సంఖ్యను పెంచారు. విలీన శాపం ఆ పంచాయతీలపై కూడా పడింది. ఆ పంచాయతీలకు, ఎంపిటీసీలకు ఎన్నికలు నాడు జరగలేదు. మునిసిపాల్టీకి ఎన్నికలు జరిగితేనే ఈ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే పరిస్థితి. ఈ పంచాయతీలకు కూడా ఏటా రూ లక్షల్లో ఆర్థిక సంఘం నిధులను కోల్పోతున్నాయి.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి, కలెక్టర్ కృతికా శుక్లా

సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

మాచర్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 20వ తేదీన మాచర్ల పట్టణంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక మున్సిపాలిటి పరిధిలో విస్తృత ఏర్పాట్లకు రంగం సిద్ధమైంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అధికారులతో సమీక్షించారు. పట్టణంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో హెలిప్యాడ్ ల్యాండింగ్ పాయింట్‌ను ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి.. జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లాతో కలిసి పరిశీలించారు.

సర్వం సిద్ధం చేస్తున్నాం..

సీఎం చంద్రబాబు పర్యటనను ఉద్దేశించి ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ఈ పర్యటనలో ప్రజలకు, కూటమి నాయకులకు అనుమతులు పరిమితంగా ఉంటాయన్నారు. వరికపూడిశెల శంకుస్థాపన నేపథ్యంలో మరోసారి నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు పర్యటన ఉంటుందని, భారీ బహిరంగ సభతో కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అధికారులతో సమీక్షించి ఏర్పాట్లలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జేసీ సూరజ్ గనోరే, అడిసనల్ ఎస్పీ సంజయ్ పాల్గొన్నారు.

జిల్లాకు తొమ్మిది స్వచ్ఛరథాలు

చెత్త తీసుకుని.. సరుకులు ఇస్తాం.. అన్న నినాదంతో ప్రారంభించిన స్వచ్ఛరథాలు జిల్లాకు తొమ్మిది మంజూరు చేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. సత్తెనపల్లి, నరసరావుపేట, చిలకలూరిపేట, మాచర్ల, దాచేపల్లి, వినుకొండ, నాదెండ్ల, యడ్లపాడు, అమరావతి మండలాలకు వీటిని మంజూరు చేశారు. వీటిని ఈ నెల 20న మాచర్ల పర్యటనలో సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. ఆ రోజుకు వాహనాలు అందుబాటులో ఉంచాలని జడ్పీ సీఈఓ జ్యోతిబసును పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశించినట్లు తెలిసింది.

నేడు గుంటూరులో రిపోర్ట్ చేయాలి

- *డీఎస్సీ అభ్యర్థులకు డీఈవో రేణుక సూచన*

గుంటూరు విద్య, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మెగా డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు గురువారం గుంటూరు పొన్నూరు రోడ్డులోని ఆంధ్ర ముస్లిం కళాశాలలో మధ్యాహ్నం రెండు గంటలకు రిపోర్టు చేయాలని డీఈవో రేణుక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న రాజధాని అమరావతిలో జరిగే నియామకపత్రాల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి డీఎస్సీ అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులలో ఒకరికి గుర్తింపు కార్డులు జారీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకానున్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో 19వ తేదీ ఉదయం ఏడు గంటలకల్లా అభ్యర్థులు, తమ కుటుంబ సభ్యులలో ఒకరు విద్యాశాఖ జారీ చేసిన గుర్తింపు కార్డులతో గుంటూరులోని పొన్నూరు రోడ్డులోని ఆంధ్ర ముస్లిం కళాశాలకు రావాలన్నారు. ప్రత్యేక బస్సుల్లో సచివాలయ సమీపంలో జరిగే నియామక పత్రాల పంపిణీ కార్యక్రమానికి తీసుకెళ్తామని అభ్యర్థులు గమనించాలని డీఈవో తెలిపారు.

ప్రతిపాదనలు.. పక్కనపెట్టారు..

నామ్‌కేవాస్తిగా జడ్ఆర్‌యూసీసీ సమావేశం

గుంటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జోనల్ రైల్వే యూజర్స్ సంప్రదింపు కమిటీ సమావేశానికి గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి హాజరైన సభ్యుల ప్రతిపాదనలకు దక్షిణ మధ్య రైల్వేజోనల్ అధికారుల నుంచి స్పష్టమైన సమాధానాలు రాలేదు. సభ్యులు చేసిన ప్రతిపాదనలను పరిశీలిస్తాం, పైకి పంపిస్తాం వంటి సమాధానాలతో మమ అనిపించారు. ఇటీవల సికింద్రాబాద్‌లో జరిగిన 76వ జడ్ఆర్ యూసీసీ సమావేశం నామ్‌కే వాస్తేగా మారింది తప్ప డివిజన్‌కు ఒరిగేది ఏమీ లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ సమావేశానికి పల్నాడు జిల్లా నుంచి కొంకా రాధ, జే శ్రీనివాసరావు హాజరయ్యారు. వీరు పలు ప్రతిపాదనలను జోనల్ అధికారులకు నివేదించగా అన్నింటినీ పక్కన పెట్టారని సమాచారం.

- మాచర్ల - విజయవాడ మెమూ రైలు బోగీల సంఖ్య పెంచాల్సిందిగా ప్రతిపాదిస్తే గతంలో 9 ఉంటే వాటిని 12కు పెంచామని రైల్వే అధికారులు సమాధానం ఇచ్చారు.
- గుంటూరు - తిరుపతి మధ్య నంద్యాల మార్గంలో రాకపోకలు సాగిస్తున్న ఎక్స్‌ప్రెస్‌ని అరుణాచలం వరకు పొడిగించాలని చేసిన ప్రతిపాదనపై రైల్వే అధికారులు సమాధానం ఇస్తూ గత నెలలో రైల్వేబోర్డుకు పంపించామన్నారు.
- మచిలీపట్నం - యశ్వంత్‌పూర్ ట్రైవీక్లీ ఎక్స్‌ప్రెస్‌ని మైసూరు వరకు పొడిగించి, డైలీ సర్వీసు చేయాలని కోరగా ఐఆర్‌టీటీసీకి నివేదిస్తామన్నారు. కాచీగూడ - నడికుడి రైలుని పిడుగురాళ్ల వరకు పొడిగించాలని చేసిన ప్రతిపాదనను తిరస్కరించారు.

అప్పు ఇవ్వడమే శాపం

ముగ్గురు ఆత్మహత్యాయత్నం.. ఇద్దరి మృతి

బాకీ తీర్చమన్నందుకు వ్యక్తి ఆత్మహత్యాయత్నంతో వెంటాడిన భయం



ఆత్మహత్య చేసుకున్న తల్లి కొడుకు పూర్ణకుమారి, వెంకటేష్(పాత చిత్రం)

శ్రీనివాసరావు (పాత చిత్రం)

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అవసరం అని అడిగిన ఓ వ్యక్తికి అప్పు ఇవ్వడమే ఆ కుటుంబం పాలిట శాపమైంది. అప్పు తీర్చమని అడగడం ఆ కుటుంబం చేసిన తప్పుగా మారింది. బాకీ తీర్చమని అడిగినందుకు ఓ వ్యక్తి పురుగుమందు తాగాడు. దీంతో భయపడిన కుటుంబం బావిలో దూకగా తల్లికుమారుడు మృతి చెందగా, భర్త ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. గుంటూరు జిల్లా సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామంలో బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి సత్తెనపల్లి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రామనాథం శ్రీనివాసరావు, పూరకుమారి దంపతులకు కుమార్తె జ్యోతి, కుమారుడు వెంకటేష్ ఉన్నారు. కాగా శ్రీనివాసరావు గ్రామంలో చిల్లర కొట్టు నిర్వహిస్తూ.. కొంతపొలం కౌలు తీసుకుని వ్యవసాయం చేస్తుంటారు. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన దాసరి వెంకటేశ్వర్లుకు శ్రీనివాసరావు కొన్ని నెలల క్రితం 50 వేలు నగదును అప్పుగా ఇచ్చాడు. దీంట్లో రూ.20 వేలు వరకు చెల్లించగా మిగిలిన నగదు ఇవ్వాలని కొద్ది రోజులుగా వెంకటేశ్వర్లుపై ఒత్తిడి తెచ్చాడు. అయితే తన వద్ద నగదు లేదని, ఇవ్వలేను, నీకు చేతనైంది చేసుకో అంటూ వెంకటేశ్వర్లు దురుసుగా సమాధానం చెప్పాడు. దీంతో శ్రీనివాసరావు భార్య పూర్ణకుమారి, కుమారుడు వెంకటేష్‌లు గ్రామ పెద్దలతో కలిసి మంగళవారం రాత్రి వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్లి డబ్బులు ఇవ్వాలని నిలదీశారు. ఈ క్రమంలో వీరి మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు పురుగు మందు తాగడంతో గమనించిన కుటుంబసభ్యులు సత్తెనపల్లిలోని ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో గుంటూరు తరలించారు. దీంతో తమ కుమారుడికి ఏమైనా అయితే మీ సంగతి తేలుస్తాం, కేసు పెడతామని వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు శ్రీనివాసరావు కుటుంబీకులను హెచ్చరించారు. ఈ క్రమంలో భార్య భర్త కొడుకు ఘర్షణ పడ్డారు. అనంతరం బుధవారం ఉదయం తల్లికుమారుడు పొలం వెళ్లగా శ్రీనివాసరావు ఇంట్లోనే ఉన్నాడు. ఇంట్లో ఉన్న గడ్డిమందును శ్రీనివాసరావు తాగి భార్యకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. అసలే అప్పు తీసుకున్న వ్యక్తి ప్రాణాపాయస్థితిలో ఉండటం, భర్త కూడా పురుగు మందు తాగానని చెప్పడంతో మనోవేదనకు గురైన పూర్ణకుమారి (54), వెంకటేష్(25) కౌలుకు తీసుకున్న పొలంలోని బావిలో దూకారు. గమనించిన కూలీలు గ్రామస్థులకు సమాచారం అందించారు. అప్పటికే శ్రీనివాసరావును కుటుంబ సభ్యులు చికిత్స కోసం సత్తెనపల్లి ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఆ తర్వాత పొలంలోని బావి వద్ద చూడగా పూర్ణకుమారి మృత దేహం నీటిపై తేలాడుతూ కన్పించింది. మునిగిపోయిన వెంకటేష్ మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీశారు. ఘటనా స్థలాన్ని రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. శ్రీనివాసరావు వాంగ్మూలం ఆధారంగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. తల్లికొడుకుల మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది. శ్రీనివాసరావు పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ఉపాధి కార్మికులకు ఊరట

- *77 రోజులకు వేతన బకాయిలు విడుదల*

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఉపాధి కార్మికులకు 77 రోజులకు వేతన బకాయిలను ప్రభుత్వం విడుదల చేసింది. రెండు రోజుల్లో కార్మికుల బ్యాంకు ఖాతాలకు జమ అవుతాయని సంబంధిత అధికారులు తెలిపారు. ఇంకా 56 రోజులకు సంబంధించిన వేతనం బకాయి ఉంది. ఐదు నెలల అనంతరం కార్మికు లకు వేతనం చెల్లించడం గమనార్హం. మే 15 నుంచి ఈ నెల 8 వరకు వేతనాలు చెల్లించాల్సి ఉంది. ఈ కాల వ్యవధిలో మే 16 నుంచి జూలై 14 వరకు వేతన బకాయిలను ప్రభుత్వం విడుదల చేసింది. ఇంకా 56 రోజులకు సంబంధించి చేసిన పనికి వేతనం కార్మికులకు చెల్లించాల్సి ఉంది. ఉపాధి సొమ్ములు సకాలంలో చెల్లించలేకపో వడంతో

ఉపాధి పనుల్లో కార్మికులు



కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రతివారం క్షేత్రస్థాయి సిబ్బంది కార్మికుల వారీగా వేతనం వివరాలను మండల కార్యాలయానికి పంపిస్తారు. వాటిని ఆన్‌లైన్లో నమోదు చేసిన రెండు రోజులకు వారి ఖాతాల్లో నగదు జమ చేయాలి. ఇదంతా జరుగుతున్నా వేతనాలు కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సి వస్తున్నన్నదని ఉపాధి కూలీలు వాపోతున్నారు. జిల్లాలో రూ 86.15 కోట్లు వేతన బకాయిలు చెల్లించాలి. వీటిలో 60 శాతం వరకు చెల్లింపులు జరగనున్నాయి.



ర్యాలీలో వేలాదిగా తరలివచ్చిన మహిళలు

బలమైన స్త్రీ శక్తి!

- త్వరలో 3 ఎలక్ట్రికల్ బస్సులతో ప్రతి గ్రామానికి విస్తరణ
- సూపర్‌సిక్స్-సూపర్‌హిట్ సభలో మంత్రి గొట్టిపాటి
- ప్రభుత్వ పథకాల్లో తొలి ప్రాధాన్యత మహిళలకే..
- ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండటౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ఏ ప్రభుత్వం ఖర్చు చేయని విధంగా 60 వేల మంది పింఛన్‌దారులకు రూ.33 వేల కోట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఖర్చు చేస్తున్నారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఎన్‌డీఏ ప్రభుత్వం వచ్చిన తర్వాత భర్త చనిపోయిన 1.10లక్షల మంది వితంతువులకు కొత్తగా పింఛన్లు అందజేయడం జరుగుతోందని వెల్లడించారు. స్థానిక నరసరావుపేట రోడ్డులోని గంగినేని కల్యాణ మండపంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి అధ్యక్షతన సూపర్ సిక్స్ - సూపర్ హిట్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముందుగా నరసరావుపేట రోడ్డులోని సాయిబాబా దేవస్థానం నుంచి కల్యాణ మండపం వరకు సుమారు రెండు వేల మంది మహిళలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవి, మహిళా కమిషన్ చైర్మన్ రాయపాటి శైలజ, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ నన్నపనేని రాజకుమారి, జిల్లా టీడీపీ అధ్యక్షులు శ్రీధర్, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు. అనంతరం గంగినేని ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన సమా వేశంలో ముందుగా ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

త్వరలో 3వేల ఎలక్ట్రికల్ బస్సులు..

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గొట్టిపాటి రవి మాట్లాడుతూ.. భారత దేశాన్ని ప్రపంచలో 3వ ఆర్థిక వ్యవస్థగా తయరు చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీకి 75వ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల కంటే స్త్రీ శక్తి పథకం ఆంధ్రప్రదేశ్‌లో సూపర్ సక్సెస్ అయిందన్నారు. త్వరలో 3 వేల ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేసి ప్రతి గ్రామానికి ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడమే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమన్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన పిల్లలను ఎంబీబీఎస్ చదివించాలన్నదే ప్రభుత్వ విధానమని పేర్కొన్నారు. రాష్ట్రంలో పీ4 భాగస్వామ్యంతో 17 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తుంటే జగన్ మోహన్‌రెడ్డి అసత్య ప్రచారాలతో ప్రజలను (మిగతా 6వ పేజీలో)



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న జీవీ, రాయపాటి శైలజ, లీలావతి

పచ్చదనంపై వేటు

- దశాబ్దాల క్రితం నాటిన చెట్లు నరికివేత
- కళాశాల ప్రిన్సిపాల్‌పై స్థానికుల ఫిర్యాదు
- విచారణకు మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాలు



పాఠశాల ఆవరణలో మొద్దులు

రేపల్లె, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పచ్చని చెట్లతో ఆహ్లాదకర వాతావరణంతో నిండిన విద్యా ప్రాంగణం ప్రస్తుతం వెలవెలపోతోంది. చెరుకుపల్లి మండలం కావూరు రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీ ఆవరణలో రెండు దశాబ్దాల క్రితం నాటిన మొక్కలు మహావృక్షాలుగా మారాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు వాటి నీడలో సేదతీరేవారు. అలాంటి చెట్లను ఉన్నతాధికారుల అనుమతి లేకుండా బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి నరికివేస్తున్నారని విద్యార్థులు తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో తల్లిదండ్రులతో పాటు, స్థానికులు కళాశాలకు వచ్చి ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. కరెంటు వైర్లకు అడ్డం వస్తున్నాయని అందువల్లే తొలగిస్తున్నామని ప్రిన్సిపాల్ సమాధానం చెప్పారు. విద్యుత్ అధికారులకు స్థానిక నాయకులు ఫోన్ చేసి రెసిడెన్షియల్ కాలేజీలో మొక్కలను తొలగించమన్నారా అని ప్రశ్నించారు. అయితే తమకు ఎలాంటి సంబంధం లేదని విద్యుత్ అధికారులు చెప్పారు. కూలీలను ప్రశించగా ప్రిన్సిపాల్ అవనిగడ్డకు చెందినవారికి అమ్మేశారని అందువల్లే నరికామని నరికామని చెప్పారు. ప్రభుత్వ స్థలాల్లో చెట్లను నరకాలంటే సంబంధిత అధికారులతో పాటు అటవీశాఖ అధికారులు అనుమతి తప్పనిసరి. అయితే వాటిని పట్టించుకోకుండా ప్రిన్సిపాల్ ఏకపక్ష నిర్ణయంతో, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా రూ.లక్షలకు చెట్ల కొట్టించి అమ్మేశారని స్థానికులు ఆరోపించారు. చెట్ల నరికివేతపై అటవీశాఖ అధికారులకు తెలిపినా పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు తెలిపారు. ఆపై వారు ప్రిన్సిపాల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కొట్టేసిన చెట్ల మొద్దులను, ట్రాక్టర్లను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఈవిషయమై మండల విద్యాశాఖాధికారి నవీన్‌కుమార్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. చెట్ల నరికివేతపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులను మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు.

సమర్థంగా స్త్రీశక్తి పథకం అమలు

- ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.అప్పలరాజు



మాట్లాడుతున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు అప్పలరాజు, చంగల్‌రెడ్డి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్త్రీ శక్తి పథకాన్ని సమర్థంగా అమలు చేయాలని.. ప్రయాణంలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలని ఆర్టీసీ నిర్వహణ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.అప్పలరాజు పేర్కొన్నారు. తెనాలి ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను బుధవారం అయన పరిశీలించారు. స్టేషన్‌తో పాటు డిపో గ్యారేజీ పరిశీలించి బస్సుల సంఖ్య, కండిషన్, రోజువారీ తిరిగే కిలోమీటర్లు, సిబ్బంది కొరత, మహిళల నుంచి ఎదురవుతున్న సమస్యలపై సమీక్షించారు. స్త్రీ శక్తి పథకం తెనాలి ప్రాంతంలో మహిళలకు బాగానే ఉపయోగపడుతుందన్నారు. మహిళల పట్ల సిబ్బంది సహనంతో వ్యవహరించాలని, గుర్తింపు ఏదైనా, దాని నకలు తెచ్చినా అనుమతించాలని చెప్పారు. బస్సుల రద్దీకి అనుగుణంగా ట్రిప్పులను పెంచాలని, బస్సుల సంఖ్య సరిపోకపోతే ప్రతిపాదనలు పంపించాలని కోరారు. బస్ స్టేషన్‌లో ఆవరణలో సహచర ఈడీలతో కలిసి మొక్కలు నాటారు. ఆయనతో పాటు ఇంజనీరింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంగల్‌రెడ్డి, జోన్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్, మేనేజర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రత్నషీలామణికి అభినందనలు



రత్న షీలామణిని అభినందిస్తునన వీసీ గంగాధరరావు, రిజిస్ట్రార్ సింహాచలం

ఏఎన్‌యూ సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్-2గా నియమితులైన ఆచార్య కె.రత్నషీలామణికి బుధవారం వర్సిటీ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. సీనియర్ ఆచార్యులుగా, ప్రిన్సిపాల్, పరిశోధన విభాగం సమన్వయకర్త, రెక్టార్‌గా రత్నషీలా మణి సేవలను కొనియాడారు. అలాగే ఓఎస్డీ రవికుమార్, దూరవిద్య సంచాలకులు వెంకటేశ్వర్లు, పలువురు డీన్లు, ప్రొఫెసర్లు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

పారిశ్రామికాభివృద్ధి, యువత ఉపాధే ధ్యేయం

- ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్

గుంటూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, యువతకు ఉపాధి కల్పనే ధ్యేయమని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. ఏపీఐడీసీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన బోర్డు మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. నూతన ఏపీఐడీసీ డైరెక్టర్లను అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కార్పొరేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారిపోయిందన్నారు. రాష్ట్రమంతటా పారిశ్రామిక అనుకూల వాతావరణం ఏర్పడిందని, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చొరవతో రాష్ట్రానికి పెట్టు బడుల వెల్లువ మొదలైందన్నారు. దాంతోపాటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రభుత్వం భారీ రాయితీలు ఇచ్చి ప్రోత్స హిస్తోందన్నారు. రాష్టంలో నిరుద్యోగాన్ని నిర్మూలించి ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు రాయితీపై పరిశ్రమల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోందన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నా రు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఎండీ, డైరెక్టర్లు బాలభారతి, రాజారావు, రమణయ్య, మనోజ్ కుమార్, పండితి మల్హోత్రా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్

ఏఎన్‌యూలో జిరోధా వర్సిటీ ఇండియాస్ ప్రీమియర్ ఫైనాన్స్ క్విజ్

- ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన పీబీ సిద్ధార్థ, ఆర్వీఆర్ జేసీ, విజ్ఞాన్

ఏఎన్‌యూ సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జిరోధా వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియాస్ ప్రీమియర్ ఫైనాన్స్ క్విజ్ విజయవంతంగా బుధవారం ముగిసింది. డాక్టర్ ఎస్. జాన్ డేవిడ్ ఆడిటోరియంలో దేశంలోని వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి 92 జట్లలో 276 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాల ప్రథమ బహుమతి రూ.12,000 గెలుచుకోగా, ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల ద్వితీయ బహుమతి రూ.9,000 సాధించింది. విజ్ఞాన్ యూనివర్సిటీ రూ.3,000 తృతీయ బహుమతి గెలుచుకుంది. ఏఎన్‌యూ (యూజీ), (ఎంబీఏ), విజ్ఞాన్ యూనివర్సిటీ జట్లు ఉత్తమ ప్రదర్శన కనబర్చినందుకు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నాయి. వర్సిటీ ప్రొఫెసర్లు, ముఖ్య అతిథులు హాజరై విద్యార్థులను అభినందించారు. కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ డీన్ ఆచార్య రామినేని శివరామ్ ప్రసాద్ సమన్వయకర్తగా వ్యవహరించారు. కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం నిర్వహణ బాధ్యతలు చేపట్టింది.



క్విజ్ విజేతలతో డీన్ ఆచార్య రామినేని శివరామ్ ప్రసాద్

బలమైన స్త్రీ శక్తి!

(5వ పేజీ తరువాయి)

పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. పోలవరం నిర్మాణంలో అసమర్థత్వం కారణంగా 9 మెగా వాట్ల విద్యుత్ కర్మాగారం నిరుపయోగంగా మారిందని, దీంతో విద్యుత్ చార్జీలను పెంచాల్సి వచ్చిందని మంత్రి గొట్టిపాటి వివరించారు.

ప్రభుత్వ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యత

చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ.. స్త్రీశక్తి బలమైన శక్తి అని.. మహిళలకు ఆస్తి హక్కు కల్పించిన ఎన్టీఆర్ మొదలుకొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు మహిళల పక్షపాతి అని పేర్కొ న్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే సూపర్ సిక్స్.. సూపర్ హిట్ చేశారన్నారు. గంజాయి లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించడంతో పాటు ప్రభుత్వ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఎన్‌ఎస్‌పీలో రూ.3 కోట్లతో టీటీడీ కల్యాణ మండపం, చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు చేస్తామని, కొండపై రామలింగేశ్వరస్వామి దేవస్థానంతో పాటు ఘాట్ రోడ్డు నిర్మించి తీరుతామని జీవీ చెప్పారు. లీలావతి కుటుంబాన్ని చక్కదిద్దుతూనే.. వ్యాపారంలో రాణిస్తూ.. 200 మందిని దత్తత తీసుకొని పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు.

డ్వాక్రా గ్రూపులతో మహిళా సాధికారత..

మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్న లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మొట్టమొదటిసారిగా డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే ప్రతి పథకంలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుం దని పేర్కొన్నారు. అనంతరం రూ.51.70 కోట్లు డ్వాక్రా సంఘాలకు రుణాల చెక్కులతో పాటు రూ.5 కోట్ల స్త్రీ నిధి చెక్కులను పంపిణీ చేశారు.

చంద్రబాబు దూరదృష్టితో రాణిస్తున్న మహిళలు

ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ముందుగా మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మహిళా కమిషన్ చైర్మన్ రాయపాటి శైలజ ప్రారంభించారు. వైద్య పరీక్షలు అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. యువకులు రక్తదానం చేశారు. స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు. రాయపాటి శైలజ మాట్లాడుతూ గతంలో మహిళలు వం టింటే పరిమితమయ్యారని, చంద్రబాబునాయుడు దూరదృష్టి కారణం గా నేడు మహిళలు అన్ని రంగాల్లో సాధికారత, ఆర్థికాభివృద్ధి సాధి స్తున్నారని పేర్కొన్నారు. స్త్రీలు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా సుమా రు రూ.2 వేలు ఆదాయం సమకూరుతుందన్నారు. భార్యాభర్త పని చేస్తేనే కుటుంబం గడవని పరిస్థితి ఉందని.. ఈ నేపథ్యంలో మహిళల కు స్త్రీశక్తి పథకం ప్రయోజనకరంగా ఉంటుందని శైలజ అభిప్రాయం వ్యక్తం చేశారు.

విద్యుత్ ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియ పూర్తి

గుంటూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీ సీపీడీసీఎల్) పరిధిలో విద్యుత్ ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియ మంగళవారంతో పూర్తయింది. సర్కిల్స్ విభజన ప్రక్రియ తర్వాత ఉద్యోగుల విభజన ప్రక్రియ కొలిక్కి వచ్చిన విషయం తెలిసిందే. పలువురు జూనియర్ ఉద్యోగులు గుంటూరు నుంచి పల్నాడు, బాపట్ల సర్కిల్స్‌కు వెళ్లాల్సి వచ్చింది. బాపట్ల, పల్నాడు సర్కిల్స్ నుంచి పలువురు ఉద్యోగులు గుంటూరు సర్కిల్‌కు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఉన్న ఉద్యోగులతో పాటు విభజనతో వచ్చిన ఉద్యోగులకు రీ పోస్టింగ్‌లు కల్పిస్తూ మంగళవారం రాత్రి గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్‌ఈ చల్లా రమేష్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగుల విభజనతో గుంటూరు సర్కిల్ పరిధిలోని గుంటూరు, తెనాలి డివిజన్‌ల నుంచి పలువురు జూనియర్ ఉద్యోగులు సీఆర్‌డీఏ, బాపట్ల జిల్లాలకు వెళ్లడంతో అక్కడ ఉన్న పలువురు సీనియర్ ఉద్యోగులు జిల్లా కేంద్రం గుంటూరుకు వచ్చినట్లయింది. ఉన్న ఉద్యోగులతో పాటు విభజనతో సర్కిల్‌కు వచ్చిన ఉద్యోగులను సర్దుబాటు చేసేందుకు ఎస్‌ఈ రెండు రోజుల పాటు కసరత్తు చేశారు.

- తెనాలి ఈఈ చిరంజీవికి ఎస్‌ఈగా

గుంటూరు సర్కిల్ పరిధిలో పలువురు అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పీ పుల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం తెనాలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా వీవీ చిరంజీవికి సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా (ఎస్‌ఈ)గా పదోన్నతి కల్పించారు. గుంటూరు టౌన్ 4 డిప్యూటీ ఈఈ పి. హుస్సేన్ ఖాన్‌కు ఈఈగా, ఇన్‌చార్జ్‌లు రాజేష్‌ఖన్నా, ఎ.సత్యనారాయణకు ఈఈలుగా పదోన్నతి కల్పించారు. నగరంలో లైన్స్ ఏఈ సుబ్బారావు, డీ4 ఏఈ అంజనీరావు డిప్యూటీ ఈఈలుగా పదోన్నతి పొందారు. కాగా వారికి పోస్టింగ్‌లు కేటాయించాల్సి ఉంటుంది.

అమ్మో బార్లా

(5వ పేజీ తరువాయి)

దరఖాస్తులు వచ్చిన బాపట్లలో 2, చీరాలలో 3, రేపల్లెలో 1 బార్‌కు లాటరీ ప్రక్రియ గురువారం ఉదయం 8 గంటలకు కలెక్టరేట్ వేదికగా జరుగుతుందని ఎక్సైజ్ విభాగం తెలిపింది. అయితే మిగిలిన 9 బార్ల విషయంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. తొలిసారి 4, రెండోసారి 6 బార్లకు వచ్చిన దరఖాస్తులు విషయంలోనే ఎక్సైజ్ విభాగం తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. పలుసార్లు ఆశావహులతో సంప్రదింపులతో పాటు, కొంతమందికి స్థానిక నేతలతో చెప్పించడం తోనే ఈ మాత్రం ఫలితాలు కనబడ్డాయని, ఇకపై మిగిలిన బార్ల విషయంలో నోటిఫికేషన్ ఇచ్చినా పెద్దగా ఉపయోగం ఉండకపోవచ్చనే అభిప్రాయాన్ని అంతర్గత సంభాషణల్లో ఎక్సైజ్ సిబ్బందే వ్యక్తం చేస్తున్నారు.

- గుంటూరు జిల్లాలో 67 బార్లకు 26 బార్లకు మాత్రమే నిబంధనల ప్రకారం దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో బార్‌కు నాలుగు చొప్పున 104 దరఖాస్తులు వచ్చాయి. మిగిలిన 41 బార్లకు దరఖాస్తులు రాలేదు.
- పల్నాడు జిల్లాలో 30 బార్లలో 8 బార్లకు నాలుగు దరఖాస్తుల చొప్పున 32 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.

41,629 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 42,909 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 41,629 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 10,081 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12300
334	10500	14500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13800	334	10500	14600
273	10000	13300	నెంబరు. 5	----	----
341	10000	15300	273	----	----
4884	----	----	341	10000	16000
సూపర్ 10	11500	14000	4884	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14800	తేజ	10000	15000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15600
బ్యాడిగి	10000	15600	దేవనూరు డీలక్స్	10500	14000
దేవనూరు డీలక్స్	10000	14000	తాలుకాయలు	5000	7400

రెరా చైర్మన్ పదవికి శివారెడ్డి వన్నె తెస్తారు

- అభినందించిన నరెడ్కో గుంటూరు ప్రతినిధులు



రెరా చైర్మన్ శివారెడ్డిని అభినందిస్తున్న నరెడ్కో ప్రతినిధులు

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రెరా చైర్మన్ ఎ.శివారెడ్డి ఆ పదవికి వన్నె తెస్తారని నరెడ్కో క్యాపిటల్ జోన్ ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం ఆయనను పదవి బాధ్యతలను స్వీకరించిన అనంతరం సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. శివారెడ్డి మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగం రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. స్టేక్ హోల్డర్స్‌తో కలిసి పారదర్శకత, సామర్థ్యం, వేగవంతమైన అభి వృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. రెరా ద్వారా నిబంధనలు కచ్చితంగా అమలు చేయడంతో పాటు, డెవలపర్స్, వినియోగదారుల ప్రయోజనాలు రక్షణ పొందే లా చూడడం తమ లక్ష్యం అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నరెడ్కో క్యాపిటల్ జోన్ అధ్యక్షుడు కేసీ హెచ్ అంకారావు, ఉపాధ్యక్షుడు వి శ్రీనాథ్, కార్యదర్శి ఎం.శ్రీనివాస్, చిన తిరుపతయ్య పాల్గొన్నారు.

ప్రమాదకరంగా చప్టా

యథేచ్ఛగా భారీ వాహనాల రాకపోకలు



పెదమద్దూరు వంతెనపై దిగబడిన ఇసుక లారీ

అమరావతి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని పెదమద్దూరు వాగు ప్రమాదకరంగా మారింది. అమరావతి -విజయవాడ మార్గంలో గతంలో నిర్మించిన లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరింది. బుధవారం తుళ్లూరు వైపు నుంచి ఇసుక లోడుతో వస్తున్న లారీ వంతెనపై దిగబడింది. ఎక్సవేటర్‌తో ఇసుకను తొలగించి వాహనాన్ని తొలగించారు. ఈ పరిస్థితుల్లో వంతెనపై భారీ వాహనాల రాకపోకలను నిలుపుదల చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అమృతవల్లికి జీవిత సాఫల్య పురస్కారం



జీవిత సాఫల్య పురస్కారం అందుకుంటున్న అమృతవల్లి

ఏఎన్‌యూ సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని వృక్షశాస్త్రం, సూక్ష్మజీవ శాస్త్ర విభాగం ఆచార్యులు అడిపూడి అమృతవల్లి బుధవారం జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. జమ్మూలోని షేర్ ఈ కశ్మీర్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ టెక్నాలజీలో మూడు రోజులుగా పుడమి- పంటల సంరక్షణే ధ్యేయంగా దేశ వ్యాప్తంగా పరిశోధకులు, విజ్ఞాన వేత్తలతో సదస్సు జరిగింది. ఏషియన్ పీజీపీఆర్ సొసైటీ భారతీయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ సదస్సుకు ఆమె అధ్యక్షత వహించారు. దశాబ్దానికి పైగా పీజీపీఆర్ అధ్యక్షురాలిగా ఆమె సేవలకు, మూడు దశాబ్దాలకు పైగా అధ్యా పకురాలిగా పరిశోధనలకు గానూ ఈ పురస్కారం లభించింది. పలు యూనివ ర్సిటీల డైరెక్టర్లు, ఏఎన్‌యూ ప్రొఫెసర్లు, సిబ్బంది ఆమెను అభినందించారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

మాచర్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలోని మండాది రోడ్డులో గల తారు ప్లాంట్ వద్ద ఈ నెల 10న జరిగిన తిరుమలకొండ చంద్రశేఖరరావు హత్య కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ ప్రభాకరరావు బుధవారం తెలిపారు. వివరాల మేరకు.. నిందితుల్లో ఒకరైన ఉప్పుతోళ్ల నాగరాజు భార్యతో మృతుడు చనువుగా వ్యవహరించడంతో కుటుంబ విచ్ఛిన్నానికి దారితీసింది. ఈ క్రమంలో నాగరాజు తన భార్యకు విడాకులిచ్చాడు. తన విడాకులకు కారణమైన చంద్రశేఖరరావుపై కక్ష పెంచుకున్న నాగరాజు తన బావమరిది దేవళ్ల సురేష్, ఉప్పుతోళ్ల నవీన్, ఓర్సు రాంబాబుతో కలిసి అతని హత్యకు పథకం రచించాడు. చంద్రశేఖరరావును నవీన్, రాంబాబు బయటకు తీసుకొచ్చి ఫూటుగా మద్యం తాగించారు. రాత్రి తారు ప్లాంట్ వద్దకు తీసుకొచ్చి నాగరాజు, అతని బావమరిది సురేష్‌కు అప్పగించి.. అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం నాగరాజు, సురేష్ బండరాళ్లతో చంద్రశేఖరరావు తలపై మోది హత్య చేశారు. ఈ మేరకు నిందితులైన నాగరాజు, సురేష్, నవీన్, రాంబాబులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ ప్రభాకరరావు తెలిపారు. నిందితులను పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరుచగా ఇన్‌చార్జి న్యాయమూర్తి శ్రీనివాస్ కల్యాణ్ నిందితులకు 15 రోజులపాటు రిమాండ్ విధించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	139, 150, 157
చికెన్ విత్ స్కిన్(కిలో)	264.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	274.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

యూటీఎఫ్ రణభేరి ప్రచార జాత

పిడుగురాళ్ల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ చేపట్టిన రణభేరి కార్యక్రమం గురువారం 8గంటలకు చిలకలూరిపేటలో ప్రారంభమౌతుందని యూటీఎఫ్ నాయకులు తెలిపారు. బుధవారం ప్రచారజాతకరపత్రాలను పిడుగురాళ్లశాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు.

● రాజుపాలెం: ఆర్థిక, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తలపెట్టిన రణభేరి కరపత్రాన్ని బుధవారం రాజుపాలెంలోని మండల విద్యావనరుల కేంద్రంలో యూటీఎఫ్ నాయకులు ఆవిష్కరించారు.

సంక్షిప్తం...

● కారంపూడి: కారంపూడిలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రుల దసరా మహోత్సవాల పుస్తక ఆవిష్కరణ బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానకమిటీ అధ్యక్షుడు హనుమంతురావు, వెంకట కోటేశ్వరరావు, ఆకుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్: మాచర్లలోని ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఈ నెల 20వ తేదీన నిర్వహించాల్సిన జాబ్ మేళాను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీకుమారి తెలిపారు. ఈ నెల 20వ తేదీన పట్టణంలో సీఎం చంద్రబాబు రానుండటం వలన జాబ్‌మేళాను వాయిదా వేశామని చెప్పారు.

● మాచర్లకు బుధవారం వచ్చిన కలెక్టర్ కృత్తికాశుక్లాను దళిత బహుజన ప్రజా సంఘాల నేతలు కలిసి సీఎం చంద్రబాబుతో మాట్లాడేందుకు వేదికపైకి తమను ఆహ్వానించాలని వినతిపత్రం అందించారు.

● రెంటచింతల: స్వస్థ్‌నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా అక్టోబరు 2వ తేదీ వరకు వైద్య శిబిరాలు నిర్వహిస్తామని పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.కృష్ణారెడ్డి చెప్పారు. బుధవారం ఆరోగ్య సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు.

● బెల్లంకొండ: బెల్లంకొండలో ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ షణ్ముక్, సిబ్బంది పాల్గొన్నారు.

● అచ్చంపేట: అచ్చంపేటలోని అంగన్‌వాడీ రెండోకేంద్రంలో పోషణమాసం కార్యక్రమాన్ని ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ బాయి ప్రారంభించారు. ముందుగా ప్రధాని జన్మదినం సందర్భంగా కేక్‌ను కట్‌చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ పార్వతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యం, పద్మ పాల్గొన్నారు.

● నకరికల్లు: కండ్లకుంట, చాగల్లు, చీమలమర్రి, చేజర్ల ఆర్ఎస్‌కేల్లో గురువారం నుంచి యూరియా, డీఏపీ పంపిణీ చేయనున్నట్టు ఏవో దేవదాసు తెలిపారు.

● రాజుపాలెం: అనుపాలెం గ్రామ మాజీ సర్పంచ్ గోగుల అంజయ్య మృతి టీడీపీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు అన్నారు. బుధవారం అంజయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ మండల నాయకులు అంచుల నరసింహారావు, చల్లా మల్లేశ్వరి పాల్గొన్నారు.

● అచ్చంపేట: మండలంలోని గ్రంధసిరి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా బుధవారం మరమ్మతుల అనంతరం నీటిని కాలువలకు విడుదల చేశారు. సంగం డెయిరీ మాజీ చైర్మన్ కిలారి రాజన్ బాబు మరమ్మతులు చేయించేందుకు కృషి చేశారు.

● క్రోసూరు: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా పరిశీలకురాలు, డైట్ కళాశాల అధ్యాపకురాలు పద్మకోటి అన్నారు. మండలంలోని బయ్యవరం జడ్పీ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఆమె మాట్లాడారు.

● ప్రజలకు ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేయటం సీఎం చంద్రబాబుకే సాధ్యమని మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కాంద్రు కాశయ్య అన్నారు. బుధవారం క్రోసూరులోని టీడీపీ కార్యాలయంలో పలువురు పార్టీ నాయకులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే పలు పథకాలువిజయవంతంగా అమలుచేశారన్నారు.ఈ సందర్భంగా స్మార్ట్‌కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ దుద్దుల యోహాన్, అనుముల వెంకటరామిరెడ్డి, మన్నెం శ్రీనివాసరావు, పరిశ రాంబాబు, అమరయ్య పాల్గొన్నారు.

● ముప్పాళ్ళ: విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పూజల్లో తహసీల్దార్ నగేష్, ఎస్‌ఐ సోమేశ్వరరావు, డాక్టర్ బి.సరళ పాల్గొన్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు క్రోసూరి రాంబాబు, కన్నెకంటి కృష్ణమాచారి పాల్గొన్నారు.

● దుర్గి: నాగార్జున కళాకేంద్రం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాగార్జునకళాకేంద్రం నిర్వాహకుడు చెన్నుపాటి శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కూలిన వైకుంఠపురం ఆలయ ప్రహరి

● నెలలు దాటుతున్నా పట్టించుకోకపోవటంపై భక్తుల మండిపాటు

అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వైకుంఠపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రహరీగోడ వెనుక వైపున కూలింది. ఇది జరిగి నెలలు గడుస్తున్నా దేవదాయశాఖ అధికారులు పట్టించుకోకపోవటంపై గ్రామస్థులు, భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వాసిరెడ్డి సుధాస్వరూప గోడ నిర్మాణానికి అంచనాలు తయారుచేయాలని కోరినా ఇంతవరకు ఆచరణలోకి రాలేదని స్థానికులు వెల్లడించారు. దేవదాయశాఖ అధికారులు స్పందించి గోడను నిర్మించాలని వారు కోరుతున్నారు.

కొత్తపల్లిలో పొలం పిలుస్తోంది

అచ్చంపేట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఏడీఏ పీ మస్తానమ్మ పత్తిపంటను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ముందుగా వేల్పూరు, అచ్చంపేట పరిధిలోని గోడౌన్‌లలోని యూరియా నిల్వలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.



గురజాల: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని

శాటిలైట్ టెక్నాలజీతో అక్రమాలను గుర్తిస్తాం

● ఎమ్మెల్యే యరపతినేని

గురజాల టౌన్, పిడుగురాళ్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో వైసీపీ నేతలు, కొందరు అధికారులు చేసిన భూఅక్రమాలకు శాటిలైట్ టెక్నాలజీతో గుర్తిస్తామని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం గురజాలలో జరిగిన మండలస్థాయి అధికారుల సమీక్షకు ముందుగా పలు గ్రామాల రైతులు, గ్రామస్థుల నుంచి వివిధ సమస్యలపై ఎమ్మెల్యే యరపతినేని దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 99.9శాతం సమస్యలు రెవెన్యూ సమస్యలేనన్నారు. దరఖాస్తు తీసుకున్న అధికారి సమస్యను ఎన్ని రోజులలో పరిష్కరిస్తారో చెప్పాలన్నారు. వైసీపీ హయాంలో గురజాల నియోజకవర్గంలో సుమారు 1600 ఎకరాల భూమాఫియాను రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా గుర్తించారన్నా రు. దైదలో అటవీభూమిని, ప్రభుత్వ భూములను సైతం అన్యాక్రాంతం చేశారన్నారు.సమావేశంలో విశ్రాంత జడ్జి రామకృష్ణ, నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, మున్సిపల్ చైర్మన్ బడేజాని, కమిషనర్ శివన్నారాయణ, తహసీల్దార్లు దుర్గేష్, మధుబాబు, నేతలు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, నేలవల్లి బొల్లయ్య, పోటు నాగేశ్వరరావు, రామారావు, శ్రీనివాసయాదవ్, నాగమల్లేశ్వరరావు, ఎన్ఆర్‌జీఎస్ ఏపీడీ సత్యనారాయణ, పంచాయతీరాజ్ డీఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికి వైద్యం అందాలి

గురజాల నియోజకవర్గంలోని ప్రతి పేదవాడికి వైద్యం అందాలని ఎమ్మెల్యే యరపతినేని అన్నారు. ప్రధాని మోదీ 75వ జ న్మదినం సందర్భంగా పట్టణంలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో స్వస్థ్ నారి స్వశక్తి పరివార్ అభియాన్ మెడికల్ క్యాంపు ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఏడుకొండలు, వైద్యులు సాయికర్ణకుమార్, వాసు, కూటమి నేతలు పాల్గొన్నారు. చల్లగుండ్ల గార్డెన్స్‌లో మోదీ జన్మదిన కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేత లేళ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మకు ఎమ్మెల్యే యరపతినేని పూజలు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో విశ్వకర్మ జయంతివార్షిక యజ్ఞమహోత్సవం లో ఎమ్మెల్యే యరపతినేని పాల్గొన్నారు. కార్యక్రమంలో సుతారు మల్లేశ్వరరావు, వేల్పూరి సైదాచా రి, ధర్మవరం వెంకటాచారి, దార్ల ఆంజనేయచారి, మిరియాల వీరబ్రహ్మాచారి, మల్లెం నాసరాచారి, కొమ్మూరి లక్ష్మణాచారి, నెమలికొండ శ్రీనివాసచారి, ఒప్పిచర్ల అమరలింగాచారి, ముమ్మడి శివరామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నవీన్ కుటుంబ సభ్యులకు రూ.14 లక్షల ఆర్థికసాయం

గురజాలటౌన్: గత మే నెలలో యూరప్‌లోని సైప్రస్ దేశంలో గురజాల పట్టణానికి చెందిన నల్ల నవీన్ రోడ్డు ప్రమాదంలో మరణించారు. అతని కుటుంబాన్ని ఆదుకునేందుకు ఎమ్మెల్యే యరపతినేని ఆదేశాల మేరకు గురజాల నియోజకవర్గానికి చెంది విదేశాల్లో స్థిరపడిన వారు రూ.14.09 లక్షల ఆర్థికసాయం పంపారు. ఈ నగదు చెక్కును బుధవారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బాధిత కుటుంబసభ్యులకు అందించారు.



గ్రామస్థులు, రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

మహిళల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా బుధవారం పట్టణంలోని 9వ వార్డులోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందన్నారు. నేటినుంచి అక్టోబరు 2వ తేదీ వరకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్యానికి సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఎలినేడి రామస్వామి, నూర్‌బాషా జానీ బాబు, మస్తాన్‌వలి, దరువూరి నాగేశ్వరరావు, బలిజేపల్లి సురేష్ కుమార్, పట్టణంలోని అర్బన్ హెల్త్‌సెంటర్ డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

● అమరావతి: పేదరిక నిర్మూలనతో పాటు మహిళల ఆరోగ్యం ప్రధాన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం బుధవారం మండలంలోని అత్తలూరు గ్రామంలో తహసీల్దార్ దానియేల్ ప్రారంభించారు. మండల గ్రామాలలో రోజుకు ఓ గ్రామం చొప్పున 15రోజుల పాటు వైద్యశిబిరాలు నిర్వహించి బాలికలు, మహిళల ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. శిశువులకు టీకాలు, క్యాన్సర్ పరీక్షలు, రక్తపరీక్షలతోపాటు పలు వ్యాధులకు పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తారని డాక్టర్ మౌనిక తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వావిలాలను ఆదర్శంగా తీసుకోవాలి

సత్తెనపల్లి: స్వాతంత్ర్య సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్యను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే కన్నా అన్నారు. పట్టణంలోని వావిలాల ఘాట్‌లో బుధవారం వావిలాల గోపాల కృష్ణయ్య 120వ జయంతిని నిర్వహించారు. వావిలాల విగ్రహానికి కన్నా పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంస్మరణ సభలో కన్నా మాట్లాడారు. కార్యక్రమంలో ఎలినేడి రామస్వామి, ఆళ్ళ సాంబయ్య, కట్టా శంకరరావు, తురకా మేరీ గ్రేస్, మారుతి, పెద్దింటి వెంకటేశ్వర్లు, పూజల వెంకటకోటయ్య, వావిలాల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

● మాజీ మంత్రి అంబటి రాంబాబు, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, వైసీపీ నాయకుడు వావిలాల ఘాట్‌లో వావిలాల విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. లోక్ జనశక్తి పార్టీ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ విజయకుమార్ కూడా పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నిర్మాణ శాస్త్ర పితామహుడు విశ్వకర్మ మహరుషి

నిర్మాణశాస్త్ర పితామహుడు విశ్వకర్మ మహరుషి అని ఎమ్మెల్యే కన్నా అన్నారు. విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో విశ్వకర్మ మహరుషి జయంతిని నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సేవా సంఘం అధ్వర్యంలో కేక్‌ను ఎమ్మెల్యే కన్నా కట్‌చేశారు. పట్టణ విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు, కార్యకర్తలు, కూటమి నేతలు పాల్గొన్నారు.

● అమరావతి: విశ్వకర్మ జయంతి స్థానిక శిశు మందిర్ పాఠశాలలో విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. విశ్వకర్మ చిత్రపటానికి విద్యార్థులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు

సత్తెనపల్లి: పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని ప్రపంచంలోనే అత్యంత శక్తివంతంగా నిలిపిన నాయకుడు మోదీ అన్నారు. కూటమి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎలినేడి రామస్వామి, ఆళ్ళ అమరేశ్వరరావు, దరువూరి నాగేశ్వరరావు, కట్టా శంకరరావు, మక్కపాటి రవిచంద్ర, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

రెంటచింతల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ 75వ జన్మదినం బుధవారం రెంటచింతలలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ యువమోర్చా నేత ఇగుటూరి రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కేక్ కట్‌చేసి రక్తదానం చేశారు. గిరిజన సంక్షేమగురుకుల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు చేపట్టారు. కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నేత పాశం మట్టారెడ్డి, సైదారెడ్డి, టీడీపీ నేత సుమంత్‌రెడ్డి, బి.రామకృష్ణ, జిల్లా బీజేపీ కార్యదర్శి పుల్లారెడ్డి, ఎస్.మోహన్, కాశీపతి, వరప్రసాద్, కోటేశ్వరరావు, మల్లికార్జునరావు, పూర్ణచంద్రరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● దుర్గి: దుర్గిలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమినేతలు పాల్గొన్నారు.

● మాచర్ల: పట్టణంలోని పార్కుసెంటర్లో బీజేపీ నేతలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జాన్‌బాబు, బొగ్గవరపు మస్తాన్‌రావు, పి.కాశీపతి, ఓర్సు క్రాంతికుమార్, యేచూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● కారంపూడి: స్థానిక గాంధీబొమ్మ సెంటర్లో కూటమి నేతలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పేదలకు అన్నదానంచేశారు. కళాకారులు, విశ్వబ్రాహ్మణులను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి శెట్టి హనుమంతురావు, కోశాధికారి పెద్దఅంజనేయులు, కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్, టీడీపీ నేతలు లక్ష్మీనారాయణ, సైదరావు, నాగిరెడ్డి, రంగారావు, అల్లయ్య, జనసేన నియోజకవర్గ కన్వీనర్ రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, జనార్ధన్ పాల్గొన్నారు.



రెంటచింతల: కేక్ కట్ చేస్తున్న కూటమి నేతలు

● దాచేపల్లి: దాచేపల్లిలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగింది. దక్షణగడ్డలో బీజేపీ మండల శాఖ అధ్యక్షులు కొప్పుల నాగేశ్వరరావు అధ్యక్షతన కేక్‌ను కట్ చేశారు.

● మాచవరం: మండలంలోని మల్లవోలులో వేడుకలు కూటమి నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల నేత రామయ్య, టీడీపీ నేతలు వాసు, సైదా పాల్గొన్నారు.



డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులను సన్మానించిన టీడీపీ నాయకులు బ్రహ్మయ్య, రమేష్ తదితరులు

డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులకు సత్కారం

పెదకూరపాడు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడులోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో బుధవారం పెదకూరపాడు మండలంలోని తొమ్మిది గ్రామాల నుంచి డీఎస్సీకి ఎంపికైన 14 మంది అభ్యర్థులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, ఎంఈవో సత్యనారాయణ, తెలుగు రైతు జిల్లా ప్రధానకార్యదర్శి భాష్యం ఆంజనేయులు, మండల టీడీపీ నేతలు పాల్గొన్నారు.

శ్రీసిమెంట్ ఫ్యాక్టరీ వద్ద కార్మికుల ఆందోళన

కారంపూడి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీసిమెంట్ ఫ్యాక్టరీ ప్రారంభమై రెండేళ్లు గడుస్తున్నా ఇంతవరకు స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని మండలంలోని ఇనుపరాజుపల్లిలోని శ్రీసిమెంట్ ఫ్యాక్టరీ వద్ద గ్రామస్థులు బుధవారం ఆందోళన జరిపారు. ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీనివాసరావు, ఏజీఎం లక్ష్మీనారాయణను ఉద్యోగాలపై టీడీపీ మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్‌యాదవ్ ప్రశ్నించారు. ఈ విషయాన్ని యజమాన్యం దృష్టికి తీసుకెళ్తామని ఉద్యోగులు హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

ఫుట్ బాల్ జిల్లా జట్ల ఎంపిక

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-19 స్కూల్‌గేమ్స్ ఆధ్వర్యంలో మండలంలోని నందిగామ జడ్పీ హైస్కూల్‌లో బుధవారం ఫుట్‌బాల్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపికలు చేసినట్లు గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-19 ఆర్గనైజింగ్ సెక్రటరీ జీ నరసింహారావు తెలిపారు. ఎంపికైనవారు త్వరలో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికల్లో జాయింట్ సెక్రటరీ పద్మారావు, పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సురేష్‌కుమార్, చిట్టిబాబు, మౌలాలి, పీడీ శివరామకృష్ణ, పీఈటీలు సాంబశివరావు, అనీల్‌దత్తనాయక్, కిరణ్‌కుమార్, ఫుట్‌బాల్ కోచ్‌లు పాల్గొన్నారు.

పొడపాడు, ముస్సాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది

పెదకూరపాడు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొడపాడు, ముస్సాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి జీ కృష్ణయ్య, వ్యవసాయ సహాయకులు వెంకటేష్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ట్రస్ట్ బోర్డు చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారం

నకరికల్లు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చేజర్ల కపోతేశ్వర స్వామి దేవాలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా వ్యవస్థాపక ధర్మకర్త రాజమరాజు రామకృష్ణ కొండలరావు బహదూర్ సభ్యులతో కలసి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులుగా అట్లూరి ఈశ్వరరెడ్డి, వంకమళ్ళ తులశమ్మ, వానపాముల కోటి లింగాచారి, మారుబోయిన కబ్బయ్య, మీసాల మల్లమ్మ, గిద్దలూరు తిరుపతమ్మ, మేఘావత్ మంగమ్మ బాయిలు ప్రమాణస్వీకారం చేశారు. ఎక్స్‌అఫిషియో సభ్యునిగా ఆలయ ప్రధానఅర్చకుచి కొండకావూరి వెంకట్రామయ్య ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బండి శ్రీనివాసులు, దేవదాయ శాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ కే మంజూష, మాజీ ఎంపీటీసీ అట్లూరి పుల్లమ్మ, దేవదాయ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.




చేజర్ల కపోతేశ్వరస్వామి దేవాలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ రాజమరాజు రామకృష్ణ కొండలరావు బహదూర్, సభ్యులు

వచ్చే నెల 15 వరకు సంతకాల సేకరణ

● కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రామచంద్రారెడ్డి

మాచర్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఓట్ల జాబితా అవకతవకలపై వచ్చే నెల 15వ తేదీ వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల మద్దతు కోరుతూ సంతకాల సేకరణ ఉద్యమం చేపట్టినట్లు కాంగ్రెస్ పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంతకాల సేకరణ ఉద్యమం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో వంగపాటి నాగరాజు, కొమ్ము కోటేశ్వరరావు, చిమటా వెంకటేశ్వర్లు, దొడ్డా శ్రీనివాసరావు, షేక్ బాబు, నాసర్‌వలి, నాయక్ పాల్గొన్నారు.



సంతకాల సేకరణ కరపత్రాలను విడుదల చేస్తున్న డాక్టర్ రామచంద్రారెడ్డి



శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

శ్రీరంగనీతులు ఆపు పిన్నెల్లి

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్ల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): హత్యలు, దోపిడీలు, దౌర్జన్యాలు, దాడులకు తెగబడి సుద్ధపూస, శ్రీరంగనీతులు పిన్నెల్లి ఆపాలంటూ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం పట్టణంలోని కేసీపీ గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో వేలమంది టీడీపీ కార్యకర్తల కుటుంబాలపై అక్రమకేసులు బనాయించి, భౌతికదాడులకు తెగబడి, హత్యా రాజకీయాలు చేసిన సంగతి మరిచావా పిన్నెల్లి అంటూ ప్రశ్నించారు. 15నెలల కూటమి ప్రభుత్వంలో మాచర్ల నియోజకవర్గం ప్రశాంతగా ఉందన్నారు. తెలంగాణలో తలదాచుకొని పిన్నెల్లి సోదరులు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దమ్ము, ధైర్యం ఉంటే నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణంపై బూటకపు హామీలు ఇచ్చి ప్రజలను మోసంచేశారన్నారు. మాచర్ల నియోజకవర్గానికి పట్టిన శని ఉంగరాల బ్రదర్స్ పిన్నెల్లి సోదరులు అని ఎమ్మెల్యే జూలకంటి ఎద్దేవాచేశారు. నియోజకవర్గంలో అభివృద్ధిని మరిచి మీ సొంత అభివృద్ధిని ఏవిధంగా పెంచుకున్నారో ప్రజలకు తెలుస న్నారు. అధికారులు, సీసీ కెమెరాల సాక్షిగా ఈవీఎం ధ్వంసంపై పోలీసులు కేసులు పెడితే అవి అక్రమకేసులు ఎందుకవుతాయని ప్రశ్నించారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక నియోజకవర్గంలో అలజడులుసృష్టించాలని పిన్నెల్లి చూస్తున్నారన్నారు. ప్రజలను తప్పుదోవపట్టించేలా నీచరాజకీయాలకు పాల్పడితే పిన్నెల్లి సోదరులను నియోజకవర్గంలో అడుగు పెట్టనివ్వమని ఎమ్మెల్యే జూలకంటి హెచ్చరించారు. గడిచిన 15 నెలల్లో వేలకోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, మీ హయాంలో నియోజకవర్గాన్ని ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని నిలదీశారు. మీరు సాగించిన రాక్షసక్రీడకు బేషరతుగా క్షమాపణలు చెప్పి రాజకీయ సన్యాసం తీసుకోవాలని సూచించారు. సమావేశంలో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్, పంగులూరి పుల్లయ్య, మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కళ్లం రామాంజిరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, కొమెర దుర్గారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనకు విస్తృతంగా ఏర్పాట్లు

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 20న మాచర్లలో సీఎం చంద్రబాబు పర్యటించనున్న సందర్భంగా విస్తృతంగా ఏర్పాట్లుచేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఏర్పాట్లను బుధవారం ఎమ్మెల్యే జూలకంటి అధికారులతో సమీక్షించి, హెలిప్యాడ్‌ను కలెక్టర్ కృత్తికాశుక్లాతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ కె.దుర్గారావు, మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ మల్లీశ్వరి, వైస్ చైర్మన్ శ్రీనివాసరావు, ఆర్డీవో మురళీకృష్ణ, డ్వామా పీడీ లింగమూర్తి, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో ఫణికుమార్‌నాయక్, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసు, టీడీపీ నేతలు కేశవరెడ్డి, వెంకటరామిరెడ్డి, వజ్రంనాయక్, శ్రీను, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే ఇంటికి శ్రీరామరక్ష

మాచర్ల రూరల్: మహిళల ఆరోగ్యమే ఇంటికి శ్రీరామరక్షని ఎమ్మెల్యే జూలకంటి అన్నారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా స్వస్థ్‌నారీ, స్వశ క్త్ పరివార్ అభియాన్ పథకంలో భాగంగా స్థానిక ప్రభుత్వవైద్యశాలలో మహిళలకు ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ కేపీ చారి పాల్గొన్నారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా షరాబు బజారులో విశ్వకర్మ భగవాన్ ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో వేణు, నాగేశ్వరరావుచారి పాల్గొన్నారు.

సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి చేసుకుందాం

● ఎంపీపీ సంజీవరెడ్డి

వెల్దుర్తి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎంపీపీ సంజీవరెడ్డి అన్నారు. బుధవారం వెల్దుర్తి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. పలు శాఖల అధికారులు తమ పరిధిలోని అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దార్ రాజశేకర్‌నాయక్, వీఆర్ఏ శ్రీనివాసరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సంజీవరెడ్డి



● క్రోసూరు: పొగాకు వ్యతిరేక విద్యాలయాలు కార్యక్రమంలో భాగంగా బుధవారం క్రోసూరు మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన వీధి నాటిక ఆలోచింప చేసింది. ప్రిన్సిపల్ మేరీ సుజన్, క్రోసూరు పోలీసు సిబ్బంది, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెయిల్‌పాండ్ వద్ద కాంట్రాక్టు కార్మికుల నిరసన

రెంటచింతల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు వద్ద బుధవారం కాంట్రాక్టు కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరశన చేపట్టారు. తెలుగునాడు విద్యుత్ కార్మికసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసనలో పలువురు నేతలు మాట్లాడుతూ కార్మికులను సంస్థలో విలీనం చేయాలని, భూములిచ్చిన కార్మికులకు రూ.ప్‌వేల అలవెన్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలుగునాడు విద్యుత్ కార్మికసంఘ అధ్యక్షుడు ధర్నారావు, కార్యదర్శి సుగుణరావు, అమర్‌నాథ్‌రెడ్డి, రామయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా తెలుగునాడు ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి సుబ్బారావులు సంఘీభావం తెలిపారు.

డిమాండ్ కంటే అదనంగా యూరియా

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో యూరియా అవసరం 24 వేల మెట్రిక్ టన్నులు కాగా తమ ప్రభుత్వం అంతకంటే అదనంగా మొత్తం 26 వేల మెట్రిక్ టన్నులను సరఫరా చేసిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ ఎక్కువగా యూరియా అందించినా సమస్యలు ఎందుకు వచ్చాయని పరిశీలిస్తే వర్షాలు అధికంగా పడటం వలన యూరియా కొట్టుకుపోయి వినియోగం పెరిగిందన్నారు. దీనికి తోడు కొన్ని మాధ్యమాల్లో యూరియా కొరత అనే ప్రచారం వల్ల రైతాంగం కంగారుపడి అధిక కొనుగోళ్లు చేయడం కూడా ఒక కారణం అన్నారు. రాబోయే సంవత్సరం అయినా ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా మార్క్‌ఫెడ్ నుంచి అధికంగా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కౌలు రైతులు ఎక్కువగా ఉండటం వల్ల వారిలో ఎవరెవరు యూరియా తీసుకుంటున్నారు అనేది తెలియడం లేదు. ఓటీపీ మెకానిజం ద్వారా ఒరిజినల్ కౌలుదారులకు యూరియా అందేలా చర్యలు తీసుకోబోతున్నామన్నారు. ఇప్పటివరకు 13 వేల మట్టి నమూనాలు పరీక్షించామని అధికారులు చెబుతున్నారు. అయితే చాలా చోట్ల సాయిల్ టెస్టులు పూర్తిస్థాయిలో జరగడం లేదు. నూతన సాంకేతిక విధానం ద్వారా సాయిల్ టెస్టులు జరిగేలా చర్యలు తీసుకోబోతున్నామని చెప్పారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా ద్వారా రైతులకు బీమా సౌకర్యం అందించేలా చర్యలు తీసుకోబోతున్నామని తెలిపారు. 90 శాతం మంది రైతులు ఇన్సూరెన్స్‌కు దరఖాస్తు చేయలేకపోతున్నారు. దానికి గల కారణాలపై సమాచారం సేకరిస్తున్నామన్నారు.. త్వరలోనే పరిష్కార మార్గాలు కనుగొని తగు చర్యలు తీసుకుంటాం. సంబంధిత సమస్యలు, ఇబ్బందులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రికి లేఖలు రాసి పరిష్కార మార్గాలు చూపిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, మార్కెటింగ్ జేడీ కాకుమాను శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, ఎల్‌డీఎం మహిపాల్, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, ఉద్యాన శాఖ డీడీ రవీంద్రబాబు రైతు నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలపై సమీక్ష నిర్వహిస్తోన్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



విద్యార్థులతో కలిసి సందడి చేస్తున్న మంచు లక్ష్మీప్రసన్న



స్మార్ట్ క్లాస్ రూమ్‌ను ప్రారంభిస్తున్న మంచు లక్ష్మీప్రసన్న, చిత్రంలో ఎమ్మెల్యే ప్రవీణ్

మంచు లక్ష్మీప్రసన్న సేవలు ఆదర్శనీయం

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) టీచ్ ఫర్ చేంజ్ పేరుతో సంస్థను స్థాపించి పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్‌రూమ్‌ను ఏర్పాటుచేస్తూ స్పోకెన్ ఇంగ్లీష్, సృజనాత్మకత పెంపొందించేందుకు కృషి చేస్తున్న మంచు లక్ష్మీ ప్రసన్న అందిస్తున్న సేవలు ఆదర్శనీయం అని పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యుడు భాష్యం ప్రవీణ్ అన్నారు. టీచ్ ఫర్ చేంజ్ సహకారంతో మండల పరిధిలోని ధరణికోటలోని ట్రులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమానికి ఎంఈవో-2 శివబాబు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని అమరావతి మండలంలో పది పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ మూడు రాష్ట్రాలలో టీచ్ ఫర్ చేంజ్ ద్వారా పాఠశాలల్లో లక్షలాది మంది విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. తాము మూడు సంవత్సరాలు పర్యవేక్షణచేసి స్థానిక ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి వారికి వదలివేయడం జరుగుతుందన్నారు. తాను నిర్మించిన దక్ష చిత్రం రెండు రోజులలో విడుదల కానున్నా ఇక్కడకు రావడం పిల్లలపై ఉన్న అభిమానమే కారణమన్నారు. పిల్లలతో కలసి సరదాగా నృత్యంచేసి వారితో పాటు, తల్లిదండ్రులు, బోధన సిబ్బందితో ఫొటోలు దిగారు. లక్ష్మీ ప్రసన్నను ఎమ్మెల్యే ప్రవీణ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెగా సిస్టమ్ ఇండియా లీగల్ కౌన్సిల్ సుయోధన్, ఎంపీడీవో పార్వతి, ఎంఈవో కేఎస్‌ఎన్ ప్రసాద్, శివబాబు, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, బోధనా సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆసియా దేశాల్లో పిన్న వయస్కులకే పక్షవాతం

పురుషుల కంటే స్త్రీలకే ఎక్కువ ప్రాణహాని

రొమ్ము క్యాన్సర్ కన్నా స్ట్రోక్ మరణాలే అధికం

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): 'అమెరికా, యూరప్ దేశాలతో పోలిస్తే ఆసియా దేశాల్లోనే పక్షవాతం త్వరగా దాడి చేస్తోంది. అమెరికాలో 60, 70 ఏళ్ల పైబడిన వృద్ధుల్లో పక్షవాతం కనిపిస్తుంటే... భారత్ వంటి ఆసియా దేశాల్లో 40వ పడిలోనే పక్షవాతం బారిన పడుతున్నారు' అని ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ (ఐఎస్ఏ) జాతీయ అధ్యక్షురాలు, న్యూరాలజిస్ట్ డాక్టర్ పీ విజయ తెలిపారు. జపాన్‌లోని హ్యోగో యూనివర్శిటీలో సెప్టెంబరు 13 నుంచి 15 వరకు జరిగిన ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ ఆసియా పసిఫిక్ స్ట్రోక్ కాన్ఫరెన్స్ (ఏపీ ఎస్‌సీ) 2025లో భారతదేశం నుంచి ఆహ్వానిత స్పీకర్‌గా ఆమె ప్రాతినిధ్యం వహించారు. బుధవారం గుంటూరులోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో డాక్టర్ విజయ ఈ సదస్సు విశేషాలను తెలిపారు. ఐఎస్ఏ జాతీయ అధ్యక్షురాలు హోదాలో హాజరైన తాను... సదస్సులో సభ్య దేశాలతో సహకార రౌండ్ టేబుల్ ప్లాట్‌ఫాంకు నాయకత్వం వహించినట్లు తెలిపారు.

పురుషుల కంటే స్త్రీలకే...

'పురుషులతో పోలిస్తే మహిళల్లో పక్షవా తం తీవ్రంగా దాడి చేస్తుంది. వీరిలో ప్రాణ హాని కూడా ఎక్కువగానే ఉంటుంది' అని డాక్టర్ విజయ తెలిపారు. ముందస్తు రుతు చక్రం, హార్మోన్ మందుల వాడకం, గర్భం ధరించడం, పాలిసిస్టిక్ ఓవేరియన్ సిండ్రోమ్ (పీసీవోడీ), సెరిబ్రల్ వీనస్ థ్రాంబోసిస్ (సీవీడీ), అధిక రక్తపోటు, ఎండోమెట్రి యాసిస్, మెనోపాజ్ వంటివి ఇందుకు దోహదపడుతున్నట్లు ఆమె వివరించారు. మహిళల్లో పక్షవాతం వల్ల మరణాలు రొమ్ము కేన్సర్ కంటే రెండింతలు అధికంగా ఉం టున్నాయి. ఇటీవల పిల్లలు, ఇరవై ఏళ్లలోపు యువతలో కూడా పక్షవాత మరణాలు సంభవించడం ఆందోళన కలిగిస్తున్నాయి' అని డాక్టర్ విజయ వెల్లడించారు. దీనిపై తాము పరిశోధనలు జరుపుతున్నట్లు ప్రకటించారు.




జపాన్‌లో సదస్సు ప్రాంగణంలో ఐఎస్ఏ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ విజయ

16 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల



విజయపురిసౌత్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎగువున ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు బుధవారం 16 క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కాగా సాగర్ జలాశయం నీటిమట్టం 588.00 అడుగులు ఉంది. ఇది 306.10 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,500, ఎడమ కాలువ ద్వారా 8,454, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,967, 16 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 1,26,240 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 1,79,861 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 1,38,805 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పెరుగుతున్న వరద ఉధృతి



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు ప్రధాన వాగుల నుంచి 2,12,284 క్యూసెక్కుల వరద నీరు బుధవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం నమోదు అవుతుండగా దిగువకు 1,98,825 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాల్వకు 7,932, పశ్చిమ డెల్టాకు 5,527 క్యూసెక్కులు వదులుతుండగా, గుంటూరు చానల్ కాల్వకు నీటి విడుదల నిలిపివేశారు. వరద ఉధృతి పెరుగుతుండడంతో బ్యారేజి దిగువ ప్రాంతాల్లో ఉన్న నది తీర ప్రాంత వాసులు, లంక భూముల రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 40.95 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 1,27,040 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, నాలుగు గేట్ల ద్వారా 94,448 క్యూసెక్కులు, మొత్తం 1,11,448 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

అంధురాలిపై..రాబంధువుల కుట్ర!

తల్లిదండ్రుల మరణంతో రూ.40 కోట్ల ఆస్తికి ఎసరు

తప్పుడు పత్రాలతో ఆస్తుల రిజిస్ట్రేషన్

సోదరుడి ఫిర్యాదుతో ఆరుగురి అరెస్టు

గుంటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల మరణంతో ఒంటరైన కుమార్తె రూ.కోట్ల ఆస్తులపై బంధువుల కళ్లు పడ్డాయి. అంధురాలు, అందులోనూ మానసిక దివ్యాంగురాలనే కనికరం చూపకుండా.. తప్పుడు పత్రాలతో స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చిందంటూ ఆస్తులను విక్రయించారు. బాధితురాలికి వరుసకు సోదరుడయ్యే వ్యక్తి ఫిర్యాదుతో అసలు గుట్టు బయటపడింది. ఇందుకు కారణమైన నిందితులు ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు, ఫిర్యాది వివరాల మేరకు...అరండల్‌పేటకు చెందిన గుంటూరు విశ్రాంత సర్వేయర్ బొల్లేపల్లి వెంకట కోటయ్య, శారద దంపతులకు ఒకే ఒక్క కూతురు ఇందిర. పుట్టుకతోనే ఆమె మానసిక దివ్యాంగురాలు, పూర్తి గా అంధురాలు. కోటయ్య 2013లో మృతి చెందారు. ఆయన భార్య శారదకు గుంటూరు నగరం, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో సుమారు రూ.40 కోట్ల ఆస్తులున్నాయి. ఆమెకు చెల్లెలు రాణి, తమ్ముడు మాధవరావు ఉన్నారు. శారద వృద్ధాప్యంతో అస్వస్థతకు లోనైన సమయంలో కృష్ణాజిల్లా నందిగామ మండలం కమ్మవారిపాలేనికి చెందిన తమ్ముడు చాపలమడుగు మాధవరావు, కుమారుడు ఉమాశంకర్, కోడలు దుర్గ భవాని రంగంలోకి దిగారు. తీవ్ర అనారోగ్యంతో ఉన్న శారదను నిర్బంధించి ఇంటిలో ఉన్న ఆస్తుల దస్తావేజులను, రెండు కిలోల బంగారు ఆభరణాలు, 6 కిలోల వెండి వస్తువులతో పాటు సుమారు రూ.70 లక్షల నగదును వారు బలవంతంగా తీసుకెళ్లారని శారద చెల్లెలు రాణి కుమారుడు పరుచూరి విష్ణువర్ధన్ రావు అరండల్ పేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు గత మే నెలలో కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణలో మాధవరావు, కుమారుడు ఉమాశంకర్‌తో పాటు.. పలువురు బంధువులు, ఇంటిలో పని పనివాళ్లు, స్నేహితుల పేరుతో ఇందిర నుంచి స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీ తీసుకొని దాని ద్వారా పెద్ద ఎత్తున ఆస్తులు విక్రయించినట్లు తేలింది. ఈ కేసులో మాధవరావు, కొడుకు ఉమాశంకర్, కోడలు దుర్గా భవాని, వియ్యంకురాలు పి.వెంకట్రావమ్మ, మాధవరావు ఇంటిలో పనిమనిషి పి.శౌరి, నిమ్మగడ్డ గ్రామానికి చెందిన కొర్రపాటి నారాయణ, గౌరవరం గ్రామానికి చెందిన పరిమి సుబ్బారావు, కమ్మవారిపాలేనికి చెందిన కొర్రపాటిరాణి, నగరంలోని హిమనినగర్‌కు చెందిన ఉమాశంకర్ డ్రైవర్ బొప్పూడి నాగరాజును నిందితులుగా చేర్చారు. ఇంతకు ముందే వెంకట్రావమ్మ, శౌరి, కొర్రపాటి నారాయణ, పరిమి సుబ్బారావు అరెస్టు చేశారు. రెండు రోజుల క్రితం ఉమాశంకర్, భార్య దుర్గ భవానీని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు మాధవరావు, కొర్రపాటి రాణి, బొప్పూడి నాగరాజు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

దస్తావేజులను రద్దు చేయాలి

నకిలీ దస్తావేజులు సృష్టించి అక్రమంగా విక్రయాలు జరపడానికి కారణమైన రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారుడు పరుచూరి విష్ణువర్దన్ రావు కోరారు. దస్తావేజులను సీజ్ చేసి, చట్ట ప్రకారం వాటిని రద్దు చేయించాల న్నారు. నల్లపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే గుంటూరులోని ఆస్తుల రిజిస్ట్రేషన్ జరిగిందన్నారు. కృష్ణాజిల్లాలోని వత్సవాయి తహసీల్దారుకు తాను నోటీసు ఇచ్చినప్పటికీ ఇందిర పేరుతో పాసు పుస్తకాలు ఇచ్చారని, ఆమె దరఖాస్తు చేయలేదని చెప్పినప్పటికీ వినిపించుకోలేదని చెప్పారు. వాటిని ఉమాశంకర్ వేరే వారికి విక్రయించాడన్నారు. ఇందిర ఉమాశంకర్ కూతుర్ని దత్తత తీసుకున్నట్లుగా తప్పుడు పత్రాలు సృష్టించి ఆస్తులు కొట్టేసారని విమర్శించారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఆమె స్పెషల్ పవర్ ఇచ్చినట్లు పత్రాలు సృష్టించి ఆస్తులను కొట్టేశారన్నారు. ఇందిర గార్డియన్ వ్యవహారంపై కూడా చర్యలు చేపట్టాలని, నిర్బంధంలో ఉన్న ఇందిరను విడిపించాలని కోరారు.

రైల్వేలో విస్తృతంగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు

● డీఆర్‌ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవ - 2025లో భాగంగా గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహించబోతున్నట్లు డీఆర్‌ఎం సుదేష్ణ సేన్ తెలిపారు. బుధవారం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో 15 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలను వెల్లడించారు. తొలుత రైల్వే అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రైల్‌వికాస్ భవన్ ప్రాంగణంలో జరిగిన శ్రమదానంలో పాల్గొని చెత్త, చెదారాలను తొలగించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ బుధవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు నిత్యం జరుగుతాయన్నారు. పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన, ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, టాయిలెట్స్‌ని శుభ్రంగా ఉంచుకోవడం, ఆరోగ్య శిబిరాలు, మారథాన్/వాకథాన్, మొక్కలు నాటే కార్యక్రమాలు వంటివి పెద్దఎత్తున నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం రమేష్‌కుమార్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎంలు కమలాకర్‌బాబు, డి.వినయ్‌కాంత్ పాల్గొన్నారు.



రైల్వే అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌ఎం సుధేష్ణ సేన్

సమర్థంగా సేవలు అందించండి

ఎస్పీకి స్పీకర్ అయ్యన్న పాత్రుడు సూచన

గుంటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన, సమర్థంగా సేవలు అందించడం ద్వారా పోలీస్ ప్రతిష్ఠ పెంచాలని ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సూచించారు. బుధవారం అసెంబ్లీలోని స్పీకర్ చాంబర్‌లో అయ్యన్నపాత్రుడిని ఎస్పీ వకుల్ జిందాల్ మర్యాదపూర్వకంగా కలసి మొక్కను అందించారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన జిందాల్‌కు పోలీస్ శాఖ ప్రతిష్ఠను పెంచేలా పనిచేయాలని ఆయన సూచించారు.

బందోబస్తుపై సమీక్ష..

అసెంబ్లీ సమావేశాల బందోబస్తు విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతో సమన్వంతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. బుధవారం ఆయన తుళ్లూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లో అధికారులకు పలు సూచనలు చేశారు. గురువారం నుంచి అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో హాజరయ్యే ప్రముఖులతో మర్యాదపూర్వకంగా మెలుగుతూ విధి నిర్వహణలో దృఢంగా వ్యవహరించాలన్నారు. సచివాలయానికి వీవీఐపీ, వీఐపీలు వచ్చే మార్గాలను ముందుగానే క్లియర్ చేసి, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. అసెంబ్లీ సమావేశ మందిరానికి వీవీఐపీ, వీఐపీలు, మీడియా వారు, సందర్శకులు వెళ్లేందుకు ఉన్న అన్ని గేట్లలో డీఎస్పీస్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించడం జరిగిందన్నారు. బాడీ ఓర్ కెమెరాలు ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రమణ మూర్తి, రవికుమార్, హనుమంతు,డీఎస్పీలు,సీఐలు,ఎస్సైలు పాల్గొన్నారు.



అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడిని మర్యాదపూర్వకంగా కలసిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

ఆర్యవైశ్య సంఘ భవనం అక్రమ రిజిస్ట్రేషన్

● బ్యాంకు రుణానికి వెళ్లడంతో వెలుగు చూసిన వైనం

యడ్లపాడు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : యడ్లపాడు ఆర్యవైశ్య సంఘం భవనాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. సంఘం ఉపకోశాధికారిగా వ్యవహరించిన వ్యక్తే రిజిస్ట్రేషన్ చేయించుకోవడం సంఘ సభ్యులను ఆశ్చర్యానికి గురిచేసింది. సంఘ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. "1925లో గ్రామానికి చెందిన ధూమాళరావు బుచ్చన్న పంతులు, హనుమాయమ్మ లైబ్రరీ సెంటర్‌లోని 4 సెంట్ల విస్తీర్ణంలోని భవనాన్ని ఆర్యవైశ్య సంఘానికి దానంగా ఇచ్చారు. దానికి అనుబంధంగా ప్రపత్తి అంజనేయస్వామి దేవాలయం కూడా ఉంది. ఆ భవనాన్ని అద్దెకు ఇస్తూ దానిపై వచ్చే అద్దెలతో ఆలయ నిర్వహణ చేసేవారు. శిథిలావస్థకు చేరడంతో ఆలయాన్ని, భవనాన్ని 2011లో కూల్చి వేశారు. నూతన భవనాన్ని నిర్మించే సమయంలో గ్రామంలోని ఆర్యవైశ్యలంతా కలసి పాత కమిటీని రద్దు చేసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామానికి చెందిన బాలనాగు సత్యన్నారాయణ అధ్యక్షుడిగా మరో ఆరుగురు సభ్యులను కమిటీగా ఎన్నుకున్నారు. మద్దుల రమణారావు ఉప కోశాధికారిగా కమిటీలో క్రియాశీలకంగా వ్యవహరించడంతో.. అధ్యక్షుడితో సహా మిగిలిన వారంతా రమణారావుకే బాధ్యతలను అప్పగించారు. 2016లో ఆలయం, భవన నిర్మాణం పూర్తి చేశారు. పంచాయతీలో పన్ను నమోదు సమయంలో భవన యజమానిగా రమణారావు తన పేరును నమోదు చేయించుకున్నాడు. తన పేరుతో చిలకలూరిపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. 2024లో భార్య శిరీష పేరుతో సదరు భవనాన్ని గిఫ్టడీడ్ చేయించాడు. ఇటీవల ఆ భవనంపై రుణం తీసుకునేందుకు నరసరావుపేటలోని ఓ బ్యాంకులో దరఖాస్తు చేశారు. బ్యాంకు సిబ్బంది భవనం కొలతలు తీసుకునేందుకు మంగళవారం గ్రామానికి వచ్చారు. భవనం కొలతలు తీస్తుండగా స్థానిక ఆర్యవైశ్యులు వారిని ప్రశ్నించారు. రమణారావు రుణం కోసం తన భార్య పేరుతో దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. దీనితో ఆర్యవైశ్యులు, మిగిలిన కమిటీ సభ్యులు రమణారావును నిలదీయగా అది తనదేనని, మీ వద్ద ఏమైనా డాక్యుమెంట్లు ఉంటే చూపించండి అంటూ దురుసుగా ప్రవర్తించాడు. దీనితో ఆర్యవైశ్య సంఘ సభ్యులంతా కలసి విచారించగా భవనాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు నిర్ధారించుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి శశికళకు వినతిపత్రం అందజేశారు. భవనానికి సంబంధించిన ఆధారాలు ఏవైనా ఇస్తే రికార్డులు సరిచేయడంతోపాటు రిజిస్ట్రేషన్ రద్దుకు సబ్ రిజిస్ట్రారుకు సిఫార్సు చేస్తామని పంచాయతీ కార్యదర్శి వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో సంఘం అధ్యక్షులు సత్యన్నారాయణ, జాయింట్ సెక్రటరి కోటేశ్వరరావు, కోశాధికారి శ్రీనివాసరావు, ఆర్యవైశ్యులు ఉన్నారు.



ఉప కోశాధికారి రమణారావు రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఆర్యవైశ్య సంఘ భవనం

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలి : ఎస్ఐ

యడ్లపాడు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించి వాహనాలు నడపాలని ఎస్ఐ శివరామకృష్ణ సూచించారు. రోడ్డు ప్రమాదాలు.. ట్రాఫిక్ నిబంధనలపై బుధవారం ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ వేగ నియంత్రణతోపాటు సరైన దిశలో ప్రయాణం చేయాలన్నారు. హెల్మెట్ ధరించడం, సీటు బెల్టు పెట్టుకోవడం వంటి ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యం చేరుకోవాలన్నారు. వేగం ముఖ్యం కాదని ప్రాణాలు, కుటుంబం ముఖ్యమని గుర్తించి నడుచుకోవాలని సూచించారు.

22 నుంచి దేవీ నవరాత్రులు

శావల్యాపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విజయదశమిని పురస్కరించుకొని శావల్యాపురం రైల్వేస్టేషన్ మార్గంలోని నీలంపాటి అమ్మవారి దేవాలయంలో నవరాత్రి మహోత్సవాలను ఈనెల 22 నుంచి అక్టోబరు 2 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మద్దినేని హరిబాబు బుధవారం తెలిపారు. దసరా రోజు మధ్యాహ్నం భారీ అన్నదానం, సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని గ్రామపురవీధుల్లో ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆంధ్ర యువ సంకల్ప్ మారథాన్

నరసరావుపేట కల్చరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ యువజన సర్వీసులశాఖ స్టెప్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల ఆధ్వర్యంలో ఈనెల 30 తేదీన ఆంధ్ర యువ సంకల్ప్- 2025 డిజిటల్ మారథాన్ నిర్వహించనున్నట్లు స్టెప్ ముఖ్య నిర్వహణాధికారి టీవీ విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో పాల్గొనే అభ్యర్థులు 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉండాలని చెప్పారు. ప్రథమ బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.75వేలు, తృతీయ బహుమతి రూ.50వేలు నగదు విజేతలకు అందజేస్తామని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆంధ్రయువ సంకల్ప్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం

వినుకొండటౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకటీగలపాలెం గ్రామపంచాయతీలో స్వచ్ఛతాహీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ సహజ వాతావరణాన్ని కాపాడుకోవాలని, ప్లాస్టిక్ వాడడం మానేయాలని, ప్లాస్టిక్ సంచులు బదులు పేపర్ బ్యాగ్స్ జ్యూట్ లేదా గుడ్డ సంచులు వాడాలని, చెట్లు ఎక్కువగా నాటాలన్నారు. గ్రామ ప్రజలకు హెల్త్ క్యాంప్ నిర్వహించటం అనంతరం ర్యాలీగా సచివాలయం దగ్గరికి వెళ్లి అక్కడ స్వచ్ఛతహీ సేవ ప్రతిజ్ఞ చేయించారు. హరిత రాయబారులు గ్రీన్ అంబాసిడర్స్ డిప్యూటీ ఎంపీడీవో సుందర్‌రెడ్డి, ఎంఆర్సీ ప్రభాకర్ రావు, పంచాయతీ కార్యదర్శి బీఏకే జిలాని, సచివాలయం సిబ్బందితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో గౌస్, శ్రీనివాసరావు, సాయి గోపి, వెంకటేశ్వరరెడ్డి, ఎం.విజయలక్ష్మి, ఆశ వర్కర్ హుస్సేన్‌బీ, షేక్ చిన్న సాయిబాబా, షేక్ సిద్దయ్య సైదమ్మ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నూజెండ్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంభంపాడులో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు బుధవారం పంచాయతీ కార్యదర్శులు నిర్వహించారు. గ్రామంలో అధికారులు, పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి బాల కోటేశ్వరరావు, స్వచ్ఛ భారత్ మండల కో-ఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య, పాఠశాల హెచ్ఎం నాగ బసవయ్య పాల్గొన్నారు.

అన్నదానంలో పాల్గొన్న సీఐ దంపతులు

నాదెండ్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గణపవరం గ్రామ పరిధిలో అయ్యప్ప స్వామి గుడి వద్ద మాలధారులకు జరుగుతున్న అన్నదానంలో చిలకలూరిపేట అర్బన్ సీఐ రమేష్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ వారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు జనసేన నాయకులు మండలనేని చరణ్ తేజ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థికి కరాటేలో సిల్వర్ మెడల్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థి వినుకుల రమ్య కరాటేలో సిల్వర్ మెడల్ సాధించిందని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈ నెల 7న దాచేపల్లిలో జరిగిన కరాటే ఇన్విటేషనల్ 2025లో సిల్వర్ మెడల్ సాధించిందన్నారు. వినుకుల రమ్యను క్యాంపస్ ఇన్‌చార్జి సర్దార్, సిబ్బంది అభినందించారు.

కొత్తపల్లిలో వైద్యశిబిరం

రొంపిచర్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నరసరావుపేటకు చెందిన ఫర్హాన హాస్పటల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. డాక్టర్ ఫర్హాక్ ఫర్వేజ్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. రూ.6,500 విలువ కలిగిన బీఎండీ పరీక్ష ఉచితంగా చేశారు. కార్యక్రమంలో కోమటినేని నాసరయ్య, ఎనుముల మల్లికార్జునరావు, గుండాల పెద వెంకటేశ్వర్లు, గంగూరి కోటేశ్వరరావు, కె.కొండలు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో బుధవారం విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశి కుమార్ విరాట్ విశ్వకర్మ జయంతి సందర్భంగా పాత పల్నాడు బస్టాండ్, శివుడిబొమ్మ సెంటర్లలో శ్రీభగవాన్ విశ్వకర్మ జయంతి కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా శ్రేణులు పాల్గొన్నారు.

అమ్మవారికి పంచామృత అభిషేకాలు

చిలకలూరిపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక చౌత్రా సెంటర్‌లోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో శ్రీవాసవీ సేవాసంఘ్ ఆధ్వర్యంలో బుధవారం అమ్మవారి జన్మ నక్షత్రం (పునర్వసు) సందర్భంగా పంచామృత అభిషేకాలు, 1,500 మంది భక్తులకు దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

మహిళల ఆరోగ్యంతోనే సాధికారత

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

● స్వస్త్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరం ప్రారంభం



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, బీజేపీ నాయకుడు రామకృష్ణ తదితరులు

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటే ప్రతీ ఇల్లు, సమాజం మెరుగుపడటమే కాక, సాధికారత సాధ్యమవుతుందన్న ఉద్దేశంతో ప్రభుత్వం స్వస్త్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరం కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఎమ్మెల్యే అరవిందబాబు తెలిపారు. నరసరావుపేటలోని జిల్లా ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో బుధవారం ఆరోగ్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ఏరియా వైద్యశాలతో పాటు, విలేజ్ హెల్త్ క్లినిక్లలో స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సిటీ స్కానింగ్, క్యాన్సర్ స్క్రీనింగ్, మాతా శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, రక్తహీనత స్క్రీనింగ్, టీబీ స్క్రీనింగ్, రుతుక్రమ శుభ్రత, పోషకాహారానికి సంబంధించిన సమాచారం కౌన్సెలింగ్ ఇస్తారని వైద్యాధికారులు తెలిపారు. మహిళలు ఈ ప్రత్యేక వైద్యశిబిరాల్లో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారులు, ఏరియా వైద్యశాల కమిటీ సభ్యులు, లక్కిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, కల్చరల్ డైరెక్టర్ బండారు విశ్వేశ్వరరావు, బీజేపీ కన్వీనర్ రామకృష్ణ, మాడక ప్రసాద్. మార్కెట్‌యార్డ్ చైర్మన్ పోనాటి శ్రీనివాసరావు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించేందుకే స్మార్ట్ రేషన్ కార్డులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలందించేందుకే స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే అరవిందబాబు తెలిపారు. ములకలూరు గ్రామంలో బుధవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అరవిందబాబు పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డులు పౌరసరఫరాల వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్డుల ద్వారా లబ్ధిదారులు సులభంగా రేషన్ సరుకులను పొందవచ్చునని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అరులైన లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

సహకార సంఘాల అభ్యున్నతే ధ్యేయం

● చైర్‌పర్సన్స్ స్పష్టీకరణ



సదస్సుకు హాజరైన సహకార సంఘాల చైర్‌పర్సన్‌లు, అధికారులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సహకార సంఘాల అభ్యున్నతే మా ధ్యేయం అని పల్నాడు జిల్లా సహకార సంఘాల చైర్‌పర్సన్స్ అన్నారు. బుధవారం నరసరావుపేట జిల్లా సహకార బ్యాంకు మీటింగ్ హాల్లో పల్నాడు జిల్లా సహకార సంఘాల చైర్‌పర్సన్‌లకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ 2025 సంవత్సరం అంతర్జాతీయ సహకార సంవత్సరం దేశం మొత్తం ఒకే విధమైన సహకార విధానం ఉండాలని తద్వారా బలమైన ఆర్థిక వ్యవస్థను తయారుచేసి సామాజిక న్యాయాన్ని ఆర్థిక సమానత్వాన్ని రైతులకు, పేదలకు అందించాలని ఉద్దేశంతో ఈ పాలసీని ఏర్పాటు చేసి కమిటీ సిఫారుసులు నిమిత్తం సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. సబ్ డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ కే తిరుపతయ్య మాట్లాడుతూ సహకార సంఘాల చైర్‌పర్సన్స్ గ్రామస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వాటి పరిష్కారాలను సొసైటీలు గ్రామస్థాయిలో, మండలస్థాయిలో నిర్వహించడానికి అనుకూలమైన వ్యాపార విషయాలపై అధ్యయనం చేసి తద్వారా ఆర్థిక స్వావలంబనను పెంపొందించు కోవాలన్నారు. సదస్సుకు జిల్లా సహకార అధికారి ఎం నాగరాజు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సబ్ డివిజనల్ కోఆపరేటివ్ అధికారి స్వర్ణ చినరామిరెడ్డి, పలు సొసైటీల అధ్యక్షులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు అభినందనలు

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో 2025 బ్యాచ్ బీటెక్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు ముగ్గురు, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు నుంచి రూ.13.80 లక్షల వార్షిక వేతన ప్యాకేజ్ ఉద్యోగాలు సాధించడం గర్వకారణ కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు, చిన్నం జానకీదేవి, తేజా చరణ్ దుల్లా, టాటా సుమంత్ కళాశాల చైర్మన్ అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ శ్రీమిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్, ప్రిన్సిపాల్ సోము వెంకటేశ్వర్లు విద్యార్థులకు అభినందనలు తెలుపుతూ, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం శుభాకాంక్షలు తెలిపారు.

రైతుల ఆర్థికాభివృద్ధే కూటమి ధ్యేయం

● మంత్రి గొట్టిపాటి రవికుమార్



కోల్డ్‌స్టోరేజ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి గొట్టిపాటి, చీఫ్‌విప్ జీవీ, మక్కెన

ఈపూరు,సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కూటమి పని చేస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఈపూరులో బుధవారం ఈపూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో రూ. 11.84 కోట్ల నిధులతో నిర్మిస్తున్న శీతల గిడ్డంగికి మంత్రి రవికుమార్, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ ఈపూరులో రూ.11.84 కోట్లతో 10 వేల టన్నుల సామర్థ్యంతో కోల్డ్‌స్టోరేజ్ నిర్మాణం చేస్తున్నామన్నారు. అనంతరం ఈపూరు సొసైటీ నూతన పాలకవర్గం సభ్యులతో జీడీసీసీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు ప్రమాణం చేయించారు. చైర్‌పర్సన్‌గా విడపలపాటి హనుమయ్య, సభ్యులుగా అయినాల కోటేశ్వరరావు, సీహెచ్ నరసింహారావులు ప్రమాణం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, సర్పంచులు గోనుగుంట్ల శ్రీనివాసరావు, అబ్బూరి ఏడుకొండలు, డీసీ చైర్మన్ గడిపూడి వేణుగోపాల్‌రావు, టీడీపీ నాయకులు మోదుగుల సత్యనారాయణ, మోదుగుల నరసింహారావు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



వరి నాటు వేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా, రైతులందరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట మండలం ఇక్కుర్రు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవిందబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో వరి నాట్లు వేస్తున్న వారి వద్దకు వెళ్లి వరి నాటు వేశారు. అక్కడే దమ్ము ట్రాక్టర్‌కి కొంతసేపు పొలంలో దమ్ము తొక్కారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న నాగరికతను అందిపుచ్చుకొని రైతులందరూ వ్యవసాయంలో యాంత్రీకరణాలు వినియోగించుకోవాలని తెలిపారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి జగ్గారావు మాట్లాడుతూ రైతులకు అవసరమైన మేర యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. రసాయనిక ఎరువులైన యూరియాకు బదులుగా నానో యూరియా వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంగిశెట్టి రామ కృష్ణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బండారుపల్లి విశ్వేశ్వర రావు, ఏవో శాంతి, ఏఈవో బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు కాంప్లెక్స్ వీధికి 'మైలవరపు రామానందం'గా నామకరణం



మైలవరపు రామానందం వీధిని ప్రారంభిస్తున్న కృష్ణతేజ

చిలకలూరిపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పొట్టి శ్రీరాములు కాంప్లెక్స్ ఉన్న వీధికి మైలవరపు రామానందం వీధిగా నామకరణం చేశారు. కొత్త వీధిని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఎం.కృష్ణతేజ బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. మున్సిపల్ కౌన్సిల్‌లో ఈ వీధికి పేరు పెడుతూ తీర్మానం చేసినట్టు కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ పి.శ్రీహరిబాబు, కృష్ణ తేజ తండ్రి ఎం శివానందకుమార్, వార్డు కౌన్సిలర్ కొత్తకుమారి, మురకొండ మల్లిబాబు, డాక్టర్ ముప్పాళ్ళ హనుమంతరావు పాల్గొన్నారు.

హామీల అమలులో ముందున్న కూటమి ప్రభుత్వం

● ఏపీ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పెమ్మసాని



ఎంఈవో పార్వతిని సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

బొల్లాపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చటంలో ముందుందని ఏపీ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పెమ్మసాని నాగేశ్వరరావు అన్నారు. బొల్లాపల్లి ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో పీ.మాధురి అధ్యక్షతన బుధవారం జరిగింది. బొల్లాపల్లి సొసైటీ చైర్మన్ పెసల వెంకట నారాయణ మాట్లాడుతూ సొసైటీ ద్వారా పురుగు మందులు, ఎరువులు, రుణాలు ఇస్తారని, రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే కొత్త వారికి కూడా ఇస్తారన్నారు. ఎంపీపీ బత్తి రాములు మాట్లాడుతూ మండలానికి 150 బస్తాలు దోమల నివారణకు మాల్‌థీన్ పౌడర్ రాగా ఎక్కడా గ్రామాల్లో పిచికారి చేయలేదన్నారు. ఎంపీడీవో మాధురి గ్రామాల్లో తక్షణమే పిచికారి చేయిస్తామన్నారు. సమావేశంలో ఉత్తమ అవార్డు గ్రహీతలైన ఎంఈవో పార్వతి, డైరెక్టర్ పెమ్మసాని నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పెసల వెంకట నారాయణలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.సుధాకర్, టీడీపీ నాయకులు హనుమానాయక్, ఆరికట్ల వాసుదేవరెడ్డి, వెలిశెట్టి రంగయ్య, క్లస్టర్ ఇన్ చార్జ్ పరిటాల రామచంద్రయ్య, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

చిలకలూరిపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికి తిరిగి కార్డులు పంపిణీ చేస్తున్నారు. చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామంలో బుధవారం తహసీల్దార్ హుస్సేన్, టీడీపీ మండల అధ్యక్షుడు జవ్వాజి మదన్, కౌన్సిలర్ జాలాది సుబ్బారావు పాల్గొని కార్డులు పంపిణీ చేశారు. పట్టణంలోని 7, 8, 18, 19, 20, 21, 29, 37 వార్డులలో జరిగిన కార్యక్రమాల్లో వార్డు కౌన్సిలర్లు, కూటమి నాయకులు, వార్డు సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

రణభేరిని విజయవంతం చేయాలి : యూటీఎఫ్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులతోపాటు విద్యారంగం, ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన రణభేరి జాతాలు విజయవంతం చేయాలని యూటీఎఫ్ అధ్యక్షుడు కే శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం మోహనరావు పిలుపునిచ్చారు. బుధవారం నరసరావుపేటలోని జిల్లా యూటీఎఫ్ కార్యాలయంలో రణభేరి పోస్టర్ ఆవిష్కరించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టీ వెంకటేశ్వర్లు, ఎల్.పూర్ణచంద్రరావు, వై.శ్రీనివాసరావు, డీ.కోటేశ్వరరావు, జీ.వెంకటేశ్వర్లు, ఎం రమాంజనేయులు, ఆర్ చంద్రయ్య, బాషా, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

అనుమతి లేకుండా నిర్మాణం చేపడుతున్నారు

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పంచాయతీ అనుమతి లేకుండా బుచ్చిపాపన్నపాలెంలోని పాఠశాల ఆవరణలో నిర్మాణాలు చేపడుతున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం అన్నారు. పాఠశాల ఆవరణలోని మంచినీటి ట్యాంకు, మరుగుదొడ్లను పక్క గ్రామం నుంచి వచ్చి పలువురు కొద్ది రోజుల క్రితం పడవేశారన్నారు. గ్రామంలో పేద వారికి ఇచ్చిన స్థలాన్ని సైతం ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టడం ఏంటని? ప్రశ్నించారు. దీనిపై రొంపిచర్ల ఎస్ఐ మణికృష్ణకు ఫిర్యాదు చేయగా సంబంధిత డిపార్టుమెంట్ వారికి ఫిర్యాదు చేయాలని చెప్పారన్నారు. అధికారులు స్పందించి ఇటువంటి సంఘటనలపై చర్యలు తీసుకోవాలన్నారు.

రిమాండ్‌కు హత్య కేసు నిందితులు

యడ్లపాడు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట శివారు గ్రామం సంగంగోపాలపురంలో జరిగిన హత్య కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం వీరిని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 14న గ్రామానికి చెందిన వేల్పూరి శ్రీనాథ్ తన భార్య అక్క కొడుకైన పోట్లూరి విష్ణుతో కలసి మద్యం సేవించాడు. వీరిద్దరి మధ్య ఘర్షణ దారితీయడంతో.. గ్రామానికే చెందిన మల్లవరపు చందు మణికంఠ, రావూరి విజయ్ జోక్యం చేసుకుని విష్ణుతో కలసి శ్రీనాథ్‌పై తీవ్రంగా దాడి చేశారు. దాడి అనంతరం శ్రీనాథ్‌ను చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి సోదరుడు సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు బోయపాలెం గ్రామంలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. చిలకలూరిపేటలో జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. నిందితులకు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పమిడిపాడు గ్రామంలో గల చేపల చెరువు వద్ద రూరల్ పోలీసులు దాడి చేసి పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.46 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ బి.కిషోర్ తెలిపారు. పోలీసుల అదుపులో ఉన్న వారిలో టీడీపీ యువజన విభాగానికి చెందిన జిల్లా స్థాయి నాయకుడు ఉన్నట్లు సమాచారం.



75 కిలోల కేక్‌ను కట్ చేస్తున్న కూటమి నాయకులు గొట్టిపాటి రవి, శైలజ, నన్నపనేని రాజకుమారి, శ్రీధర్, జీవీ, లీలావతి, మక్కెన

ఘనంగా మోదీ పుట్టిన రోజు వేడుకలు

● బీజేపీ నాయకుడు లెనిన్ ఆధ్వర్యంలో 75 కిలోల కేక్

వినుకొండ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని నరసరావుపేట రోడ్డులోని గంగినేని ఫంక్షన్ హాల్లో బీజేపీ నాయకుడు యార్లగడ్డ లెనిన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 75 కిలోల కేక్‌ను జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ రాయ పాటి శైలజ, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, నన్నపనేని రాజకుమారి, శివశక్తి ఫౌండేషన్ గోనుగుంట్ల లీలావతి, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు చేతుల మీదగా కట్ చేసి మోదీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పోలేరమ్మ గుడి వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా జీవీ, మక్కెన పాల్గొని పరిసరాలను శుభ్రపరిచారు.

నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో...

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వై.శశికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రక్తదానం చేయడం ద్వారా మానసిక ఒత్తిడి తగ్గుతుందని, శారీరిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రమేష్‌బాబు, కళాశాల వైస్‌చైర్మన్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

శావల్యాపురం మండలంలో...

శావల్యాపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను మండలంలోని ఇర్లపాడులో బీజేపీ మండలాధ్యక్షుడు గట్టుపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మోదీ చిత్రపటానికి కూటమి నాయకులు పాలాభిషేకాలు నిర్వహించి పుట్టినరోజు కేకును కట్ చేసి ప్రధానికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెనిగండ్ల రమాదేవి, సేవా పక్వాడ్ ప్రోగ్రాం ఇన్‌చార్జి గర్రె అనిల్, కన్వీనర్ అన్నవరపు శ్రీను పాల్గొన్నారు. కనమర్లపూడి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేంద్ర, కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా పట్టణంలోని 35వ వార్డు సాంబశివనగర్‌లో కూటమి నాయకులు ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. వైద్యశిబిరాన్ని నిర్వహించారు. రక్తదానం చేశారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, జనసేన ఇన్‌చార్జ్ తోట రాజా రమేష్, బీజేపీ నాయకులు మల్లెల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన బస్సు షెల్టర్ ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి రవి



సాయిబాబా గుడి వద్ద బస్సు షెల్టర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి

వినుకొండ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వినుకొండ పురపాలక సంఘం పరిధిలోని నరసరావుపేట రోడ్డు ఎన్ఎస్‌పీ కాల్వకట్ట వద్ద శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన నూతన బస్సు షెల్టర్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవి ఆంజనేయులు, రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్మన్ రాయపాటి శైలజ, శివశక్తి ఫౌండేషన్ చైర్‌పర్సన్ గోనుగుంట్ల లీలావతి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ కౌన్సిలర్ షకీలాబేగం, మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలి

వినుకొండటౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుకి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కొంజేటి నాగశ్రీను రాయల్ వినతి పత్రం అందజేశారు.

జిల్లాకు 1185 మెట్రిక్ టన్నుల ఎరువులు

నాదెండ్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు బుధవారం 1185 మెట్రిక్ టన్నుల ఎరువులను ప్రభుత్వం కేటాయించిందని జిల్లా వ్యవసాయాధికారి ఎం జగ్గారావు తెలిపారు. సాతులూరు గ్రామపరిధిలో గల రైల్వేస్టేషన్‌లో ఎరువుల ర్యాక్‌ను పరిశీలించారు. జిల్లాలో ఎరువులకు ఎలాంటి కొరత లేదని వివరించారు. ఏడీఏలు హనుమంతరావు, కేవీ శ్రీనివాసరావు, ఏవో శ్రీలత పాల్గొన్నారు.